ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :64 నల్గొండ శుక్రవారం 23-05-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ పేజీలు : 4 వెల : రూ.1/-

**విలేఖరులు కావలెను**

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ,
పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com

## పాకిస్థాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాం



జయపుర,మే22: మన మహిళల సిందూరాన్ని తుడిచిన వాళ్లను మట్టిలో కలిపేశామని ప్రధాని మోడీ అన్నారు. మన భద్రతా బలగాలు పాకిస్థాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాయని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ను ఉద్దేశించి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాదుల ఏరివేతకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో దేశ ప్రజలంతా గర్విస్తున్నారని అన్నారు. రాజస్థాన్‌లో పర్యటిస్తున్న సందర్భంగా బికనీర్‌లో ఏర్పాటు చేసిన సభలో పహల్గామ్ గురించి మాట్లాడుతూ.. ఉద్వేగపూరితంగా ప్రసంగం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను అంతం చేశామని తెలిపారు. కేంద్రం త్రివిధ దళాలకు పూర్తి స్వచ్ఛ ఇచ్చిందని గుర్తుచేశారు. మన దళాలు చక్ర వ్యూహాలు పన్ని శత్రువులను ఉక్కిరిబిక్కిరి చేశాయని తెలిపారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్ర దాడికి జవాబుగా 22 నిమిషాల్లోనే ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల్ని మట్టుబెట్టినట్లు చెప్పారు. భారత్‌లో రక్తపుటేర్లు పారించిన వాళ్లను ముక్కలు.. ముక్కలు చేసినట్లు మోడీ పేర్కొన్నారు. మే 7న చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే-ఎ-తోయిబా మరియు హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద గ్రూపులతో అనుబంధంగా ఉన్న దాదాపు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపారు. ఉగ్రవాదంపై పోరాటానికి భారతదేశం ఐక్యంగా ఉందని చెప్పారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి 140 కోట్ల మంది భారతీయులను కదిలించిందన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల గుండెపై దాడి చేశామన్నారు. సైన్యానికి పూర్తి స్వేచ్ఛ నివ్వడంతోనే ఇదంతా జరిగిందని మోడీ చెప్పుకొచ్చారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాదులు.. అమాయకులను లక్ష్యంగా చేసుకున్నారని.. మతం ఆధారంగా వేరు చేసి.. మహిళల నుదిటిపై ఉన్న సిందూరాన్ని తుడిచేశారని.. దానికి ప్రతీకారంగానే మన దళాలు వాళ్లను మట్టిలో పాతిపెట్టేశారన్నారు. 140 కోట్ల మంది భారతీయుల హృదయాలను గాయపరిచారు.. అందుకే వాళ్లను ముక్కలు.. ముక్కలు చేశామని వెల్లడించారు. కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాదుల శిబిరాలు నాశనం అయినట్లు చెప్పారు. త్రివిధ దళాల దెబ్బకు పాకిస్థాన్ వెనక్కి తగ్గిందని తెలిపారు. ఇక అణు బాంబుల భయానికి భారతదేశం వెనుకాడదని మరోసారి మోడీ స్పష్టం చేశారు.'సిందూరం భగ్గుమంటే దాని ఫలితం ఎలా ఉంటుందో అందరూ చూశారు. ఏప్రిల్ 22న ఉగ్రదాడికి ప్రతిగా 22 నిమిషా ల్లో ఉగ్రస్థావరా లను ధ్వంసం చేశాం. ఉగ్రమూకలను మట్టిలో కలిపేశాం. నా సిరల్లో రక్తం కాదు సిందూరం ప్రవహిస్తోంది. పాక్‌లోని రహీమ్ యార్ ఖాన్ ఎయిర్‌బేస్ ఐసీయూలో ఉంది.



## సంపాదకీయం

శుక్రవారం 23-05-2025

# ఆధునిక యుద్ధం... కృత్రిమ మేధే ఆయుధం

ఆధునిక యుద్ధ తీరుతెన్నులను కృత్రిమ మేధ (ఏఐ) సమూలంగా మార్చేస్తోంది. అపార సమాచార రాశిని అది వేగంగా విశ్లేషిస్తోంది. దానివల్ల శత్రువులను చావుదెబ్బ తీసే వ్యూహాలను పన్నడం సులువవుతోంది.దృశ్య కాంతి నుంచి పరారుణ కాంతి వరకు పలు తరంగ దైర్ఘ్యాల కాంతిని ఒకేసారి సంగ్రహించగల మల్టీస్పెక్ట్రల్ సెన్సర్ గ్రిడ్ తెర మీద చిన్న బిందువు కనిపించింది. ఆ బిందు గమన తీరును, దాని విద్యుదయస్కాంత జాడను, శబ్ద తరంగ చలనాన్నీ మిల్లీ సెకన్లలోనే కృత్రిమ మేధా (ఏఐ) యంత్రాంగం గణిస్తుంది. అందుబాటులో ఉన్న అపార రక్షణ సమాచారాన్ని విశ్లేషించి ఆ కదిలే బిందువు చైనాలో తయారైన స్వయంచోదిత ఫిరంగి శకటమని గుర్తిస్తుంది. కక్ష్యలో తిరుగుతున్న ఉపగ్రహం, సమీపంలోనే గాలిలో ఎగురుతున్న డ్రోన్, భూతల రాడార్ కలిసి ఆ బిందువుపై కన్నువేయాలని ఏఐ నిర్దేశిస్తుంది. ఆ శత్రు లక్ష్యాన్ని ఏ విధంగా తుత్తునియలు చేయవచ్చునో అన్ని కోణాల నుంచి పరిశీలిస్తుంది. చివరికి మూడు దాడి పద్ధతులను ఎంపిక చేస్తుంది. వాటిలో రెండోది- లక్ష్యానికి దగ్గర్లో గాలిలో తచ్చాడుతున్న లాయిటరింగ్ బాంబును ప్రయోగించడం. దానికి మన సైన్యాధికారి ఆమోదముద్ర వేస్తాడు. అంతే.. లాయిటరింగ్ బాంబు వెంటనే నేల మీది శత్రు లక్ష్యంపై పడి పేలిపోతుంది. అక్కడికి సమీపంలో ఎగురుతున్న మైక్రో డ్రోన్ ఒకటి ఆ దృశ్యాన్ని మన సైన్యాధికారికి పంపిస్తుంది. ఇదంతా ఏదో సైన్స్ ఫిక్షన్ సినిమాలోని సన్నివేశం కాదు- ఇటీవలి భారత్-పాక్ సంఘర్షణలో, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కనిపించిన నిజ ఘటనలే!

సత్తా చాటిన ఇండియా

జీపీఎస్ ఉపగ్రహాల నుంచి, యుద్ధ క్షేత్రం నుంచి నేరుగా సమగ్ర సమాచార నివేదికలు మన ఏఐ యంత్రాంగానికి అందుతాయి. అది ఇతరుల సంభాషణలు, లిఖిత సందేశాలను పరిశీలించి వాటిని పొందికైన సమాచారంగా మారుస్తుంది. ఫొటోలుగా, వీడియోలుగా, థర్మల్ చిత్రాలుగా డ్రోన్లు పంపే దృశ్యాలు, శబ్దాలుగా అనుక్షణం ప్రవహించే అపార సమాచారాన్ని విశ్లేషించి చప్పున నిర్ణయాలు తీసుకోవడం మానవ మేధకు అలవికాని పని. ఈ విశ్లేషణ బాధ్యతను ఏఐకి అప్పగిస్తాం. అది ప్రత్యక్షంగా ప్రసారమవుతున్న సమాచారాన్ని, క్లౌడ్‌లో నిక్షిప్తమైన పూర్వ యుద్ధాల అనుభవ జ్ఞానాన్ని మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ ద్వారా ప్రాసెస్ చేస్తుంది. న్యూరల్ నెట్‌వర్కులు ఆ సమాచారానికి భాష్యం చెబుతాయి. దాన్నిబట్టి మనకు ఎదురుకాగల ప్రమాదాల గురించి క్వాంటమ్ కంప్యూటింగ్ వివిధ ఊహా చిత్రణాలను (సినేరియో) ప్రతిపాదిస్తుంది. వాటి ఆధారంగా మనం తీసుకోవాల్సిన చర్యలను ఏఐ సూచిస్తుంది. ఇదంతా మానవ మేధకు అందనంత వేగంగా జరిగిపోతుంది. ఉక్రెయిన్‌లో జీఐఎస్ ఆర్టా వ్యవస్థ యుద్ధ రంగం నుంచి అందుతున్న సమాచారాన్ని క్షణాల్లో విశ్లేషించి ఫిరంగులతో సమన్వయీకృత దాడులు నిర్వహిస్తోంది. చైనాలో హిక్ విజన్, ఐఫ్లైటెక్ సంస్థలు తయారుచేస్తున్న నిఘా కెమెరాలు ఆ దేశ సైన్యానికి విలువైన సమాచారాన్ని అందిస్తున్నాయి.నేడు రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని కృత్రిమ మేధా సమరానికి ప్రయోగశాలగా పరిగణిస్తున్నారు. రష్యన్ ట్యాంకులు, ఫిరంగులను నాశనం చేయడానికి ఉక్రెయిన్ ఫస్ట్ పర్సన్ వ్యూ (ఎఫ్‌పీవీ) డ్రోన్‌లను ఉపయోగిస్తోంది. భూతలంతో సంబంధాలు తెగిపోయినా తమంతటతాముగా ముందుకెళ్లి శత్రు ట్యాంకులు, ఫిరంగులపై విరుచుకుపడే డ్రోన్లనూ ఉక్రెయిన్ వాడుతోంది. ఒక్కమాటలో- డ్రోన్లను ఆలోచించే బాంబుల్లా మార్చేయడంలో ఏఐ సఫలమైంది. గాజా, లెబనాన్‌ల మీదుగా ఎగురుతూ అక్కడి సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేసే డ్రోన్ల దండును ఇజ్రాయెల్ ప్రయోగిస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ తన డ్రోన్ యుద్ధపటిమతో ప్రపంచాన్ని అబ్బురపరచింది. స్వదేశీ నావిక్ ఉపగ్రహాలు, ఏఐ కమాండ్ నెట్‌వర్కుల సాయంతో మన ఆత్మాహుతి డ్రోన్లు గురితప్పకుండా లక్ష్యాలను ఛేదించాయి. ఎలక్ట్రానిక్ జామింగ్‌కు అందకుండా, సొంత కెమెరాతో అన్నీ గమనిస్తూ అవసరమైనప్పుడు మధ్యలోనే దారి మార్చుకుంటూ పాక్‌లోని లక్ష్యాలపై పడి నాశనం చేశాయి.

సైబర్ సమరానికి బాసట

నేడు సమాచారమే సైన్యాన్ని నడిపిస్తోంది. సేనలకు ఆయుధాలు, ఆహార బట్వాడా వాహనాలకు భద్రమైన దారిని ఏఐ సూచిస్తోంది. కొన్ని ఆయుధ వ్యవస్థలు ఎప్పుడు విఫలం కావచ్చో ముందే గుర్తించి హెచ్చరిస్తోంది. ప్రత్యర్థి సైబర్ దాడుల నుంచి మన వ్యవస్థలను రక్షించుకోవడంతోపాటు మనమే శత్రువుపై దాడి చేయడానికి ఏఐ సైదోడుగా నిలుస్తోంది. ఇరాన్ ఇప్పటికే ఇజ్రాయెల్‌పై ఏఐ సాయంతో సైబర్ దాడులకు పాల్పడుతోంది. చైనా సైబర్ సేన ప్రత్యర్థుల దాడులను అడ్డుకోవడంతోపాటు వారి సైబర్ యంత్రాంగంలోని లొసుగులను కనిపెట్టి దాడి చేస్తోంది. అయితే బొమ్మ తుపాకీతో ఆడుకుంటున్న పిల్లవాడికీ, నిజమైన తుపాకీ ధరించి తిరుగుతున్న సైనికుడికీ మధ్య తేడాను కనిపెట్టే సామర్థ్యం ఇప్పటికైతే ఏఐకి లేదు. ఇది నైతిక పరమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఏది ఏమైనా ఆపరేషన్ సిందూర్‌ను స్వదేశీ ఆకాశ్ క్షిపణులు, నావిక్ ఉపగ్రహాలు విజయవంతం చేశాయి. తుర్కియే, చైనాల నుంచి పాక్ సంపాదించిన ఆధునిక డ్రోన్లు, క్షిపణులు, జామింగ్ పరికరాలను భారత్ నిర్వీర్యం చేయగలిగింది. మన ఏఐ పోరాట పటిమను మరింత శక్తిమంతం చేసుకోవడానికి శాస్త్రవేత్తలు, సైన్యాధికారులు చేయీచేయీ కలిపి కృషి చేయాలి. ఏఐ అనేది కేవలం ఏదో కొత్త టెక్నాలజీ కాదు. యుద్ధాల స్వరూప స్వభావాలను మార్చేస్తున్న అపూర్వ శక్తి అది. ఈనాటి యుద్ధాలు సైనికుడికీ సైనికుడికీ మధ్య కాకుండా అల్గోరిథమ్‌కూ అల్గోరిథమ్‌కూ మధ్య నడుస్తున్నాయి. ఏఐలో ఆరితేరిన దేశమే రేపటి యుద్ధాల్లో గెలుస్తుంది. భారత్ అలాంటి అజేయ శక్తిగా నిలవాలి.

# అగ్నికీలలు మింగేస్తున్నా పాఠాలు నేర్వమా!



హైదరాబాద్,హైదరాబాద్‌లో ఇటీవల సంభవించిన ఘోర అగ్ని ప్రమాదం, ఎనిమిది మంది చిన్నారులతో సహా పదిహేడు నిండు ప్రాణాలను బలిగొంది. వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాలు అగ్ని ప్రమాదాలకు కేంద్రాలుగా ఎలా మారుతున్నాయో ఈ దుర్ఘటన మరోసారి స్పష్టం చేసింది. వ్యవస్థాపక లోపాలు, మౌలిక సదుపాయాల కొరత, సమిష్టి బాధ్యతలో ఉన్న వైఫల్యాల కారణంగా పదే పదే సంభవిస్తున్న దుస్థితికి ఇది నిదర్శనం. ఇలాంటి ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరుగుతాయనుకుంటే పొరపాటే. తరచుగా ఇవి నిబంధనల ఉల్లంఘనలు, మౌలిక లోపాలు, భద్రత పట్ల నిర్లక్ష్యం వంటి పలు అంశాల పర్యవసానమే. ఈ విపత్తుల విష వలయం నుండి బయటపడాలంటే, మన నగరాలు ఎందుకు అగ్నికి ఆహుతవుతున్నాయో సమగ్రంగా విశ్లేషించి, భవనాలను నిర్మించే, నియంత్రించే, నివసించే విధానంలో సమూల మార్పులు తీసుకురావాలి.నిర్లక్ష్యపు నిప్పు రవ్వలు మంటలు చెలరేగడానికి ముఖ్య కారణాలు చూస్తే, భవనాల్లో ఎక్కువగా దారితీసేవి విద్యుత్ సంబంధిత లోపాలే. నాసిరకం విద్యుత్ వైరింగ్, నిర్వహణ సరిగా లేని పాత వ్యవస్థలు, అధిక లోడు మోస్తున్న సర్క్యూట్లు, అర్హత లేనివారితో చేయించిన తాత్కాలిక మరమ్మతులు%ౌ%షార్ట్ సర్క్యూట్లు, వైరింగ్ కాలిపోవడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తాయి. ముఖ్యంగా పురాతన భవనాలలో, నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన నిర్మాణాలలో ఈ సమస్య తీవ్రం. ఇది నివాస, వాణిజ్య స్థలాలను క్షణంలో అంటుకునే పదార్థాలుగా మారుస్తుంది. వంట గ్యాస్ సిలిండర్ల లీకేజీలు, లోపభూయిష్టమైన రెగ్యులేటర్లు, గ్యాస్ పైప్‌లైన్లు కూడా ప్రమాదకరమే. సులభంగా మంటలు అంటుకునే పెయింట్లు, రసాయనాలు, ప్లాస్టిక్ వంటి వాటిని అజాగ్రత్తగా నిల్వ చేయడం, మానవ నిర్లక్ష్యం కూడా ఇటువంటి ప్రమాదాలకు తోడవుతున్నాయి. అజాగ్రత్తగా వదిలేసిన సిగరెట్లు, వంట చేసేటప్పుడు శ్రద్ధ వహించకపోవడం, సరిగా పర్యవేక్షించకుండా హీటింగ్ పరికరాలు వాడటం వంటివి చిన్నగా మొదలై పెద్ద విపత్తులుగా రూపాంతరం చెందుతాయి. కనీస భద్రతా వ్యవస్థలు లేని ప్రదేశాలలో ఈ లోపాలు ప్రాణాంతకంగా మారతాయి.ప్రణాళికాబద్ధం కాని వేగవంతమైన పట్టణీకరణ అధిక జనసాంద్రతకు దారితీసింది. వాణిజ్య, నివాస స్థలాలు పక్కపక్కనే ఉండటం, ఒకే భవనాన్ని వివిధ అవసరాలకు వినియోగించడం అగ్ని ప్రమాదాల తీవ్రతను పెంచుతుంది. అనేక నగర చారిత్రక కేంద్రాలు ఇరుకైన వీధులు, ఒకదానికొకటి ఆనుకుని ఉండే భవనాలతో నిండి ఉంటాయి. ఇవి ఆధునిక అగ్నిమాపక వాహనాలు, రెస్క్యూ పరికరాలు సంఘటనా స్థలానికి చేరుకోవడానికి, పనిచేయడానికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తాయి. చిన్న మంటలు కూడా నియంత్రణకు అందని మహా విషాదాలుగా మారతాయి. అక్రమ నిర్మాణాలతో పాటు ఆక్రమణలు అత్యవసర మార్గాలను మూసి వేస్తాయి. ప్రాణాలను కాపాడే అవకాశాలను తగ్గిస్తాయి. సరైన నిష్క్రమణ మార్గాలు లేకపోవడం వల్ల మంటలు చెలరేగిన ప్పుడు భవనం నుండి బయటపడటం కష్టమవుతుంది.సమస్యకు మరో కీలక కోణం ఏమిటంటే, మన దేశంలో అగ్ని భద్రతా నియమాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో తీవ్ర లోపాలున్నాయి. నేషనల్ బిల్డింగ్ కోడ్, వివిధ రాష్ట్రాల అగ్నిమాపక సేవల చట్టాలు భవన నిర్మాణంలో భద్రతా ప్రమాణాలైన ఫైర్-రెసిస్టెంట్ మెటీరియల్ వాడకం, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ డిటెక్షన్, అణచివేత వ్యవస్థలు, తప్పనిసరి ఆడిట్‌లు, నిరభ్యంతర ధృవీకరణ పత్రం తప్పనిసరి చేస్తాయి. అయినప్పటికీ వీటి ఆచరణలో అనేక లోపాలున్నాయి. తగినంత మంది శిక్షణ పొందిన ఇన్‌స్పెక్టర్లు లేకపోవడం, నియంత్రణ సంస్థలలో వనరుల కొరత, తనిఖీ అనుమతి ప్రక్రియలో జాప్యం, అవినీతి, భద్రతా నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం, బాధ్యులను న్యాయస్థానాలకు అప్పగించే ప్రక్రియలో లోపం%ౌ%నిర్లక్ష్యాన్ని ప్రోత్సహిస్తున్నాయి. అనేక భవనాలు, ముఖ్యంగా పెద్ద నివాస, వాణిజ్య సముదాయాలు కూడా, సరైన అగ్నిమాపక అనుమతులు లేకుండా లేదా కాలం చెల్లిన భద్రతా వ్యవస్థలతో పనిచేస్తున్నాయి. అంతేకాకుండా, అగ్ని భద్రత పట్ల విస్తృతమైన ప్రజా అవగాహన లేకపోవడం, సౌలభ్యం ఖర్చులకు ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతి కూడా ఈ సమస్య తీవ్రతరం చేస్తున్నాయి. భవనాలలో నివసించే వారికి, పని చేసే వారికి ప్రాథమిక అగ్ని భద్రతా పద్ధతులు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు ఎక్కడ ఉన్నాయో తెలియదు.అగ్నిమాపక పరికరాలు ఎలా వాడాలో అవగాహన ఉండదు. ప్రైవేట్ భవనాలలో అగ్నిమాపక డ్రిల్స్ నిర్వహించడం చాలా అరుదు. ఓవర్‌లోడ్ అయిన ఎలక్ట్రికల్ సాకెట్లు, అడ్డంగా ఉన్న మెట్ల మార్గాలు వంటి చిన్న చిన్న భద్రతా లోపాలను ఒక పెద్ద ప్రమాదం జరిగే వరకు పట్టించుకోని ధోరణి ఎక్కువగా ఉంటుంది.ఈ బహుముఖ సమస్యను పరిష్కరించడానికి పటిష్టమైన, సమగ్ర వ్యూహం అవసరం. దీనికి ప్రభుత్వ నిబద్ధత, కఠినమైన అమలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా భాగస్వామ్యం తప్పనిసరి. కేవలం చట్టాలు ఉండటం కాదు. వాటిని అమలు చేసే యంత్రాంగం బలంగా ఉండాలి. వాణిజ్య, నివాస, పారిశ్రామిక, ప్రభుత్వ భవనాలకు తప్పనిసరిగా నిర్ణీత కాల వ్యవధిలో అగ్ని భద్రతా ఆడిట్‌లు నిర్వహించాలి. వీటిని స్వతంత్ర, అర్హత కలిగిన థర్డ్ పార్టీల ద్వారా చేయించాలి. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే ప్రాంగణాలను సీల్ చేయాలి. ప్రమాదం జరిగితే క్రిమినల్ బాధ్యత వహించేలా చట్టాలు బలంగా ఉండాలి. అనుమతి ప్రక్రియను పారదర్శకంగా, అవినీతి రహితంగా, సాంకేతిక ఆధారితంగా మార్చాలి. రెండవది, అగ్నిమాపక విభాగాన్ని బలోపేతం చేయడానికి గణనీయమైన పెట్టుబడి పెట్టాలి. పట్టణ సవాళ్లకు అనుగుణంగా ఆధునిక పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది సంఖ్యను పెంచడం, కమ్యూనికేషన్ వ్యవస్థలు మెరుగుపరచడం, నీటి వనరుల లభ్యత (ఫైర్ హైడ్రెంట్లు) వంటివి వారికి తప్పనిసరిగా అందించాలి. పట్టణ ప్రణాళికలోనే అగ్ని భద్రతను ఒక భాగంగా చూడాలి. పాత భవనాలకు ఆధునిక భద్రతా సదుపాయాలను కల్పించడానికి ప్రోత్సాహకాలు ఇచ్చి, క్రమంగా వాటిని తప్పనిసరి చేయాలి. మూడవది, భవనాల యజమానులు, ఆపరేటర్లు, నిర్వాహకులు తమ ప్రాంగణాలలో అగ్ని భద్రతా ప్రమాణాలను పాటించే బాధ్యతను చట్టపరంగా వహించాలి. విద్యుత్ వ్యవస్థలు, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలను క్రమం తప్పకుండా తనిఖీ నిర్వహణ చేయడం విధిగా మారాలి. చివరగా, విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు ప్రాథమిక శిక్షణ ద్వారా పౌరులను అగ్ని భద్రతపై చైతన్యపరచాలి. ప్రమాదకర పరిస్థితులను ఎలా గుర్తించాలి. అగ్నిమాపక పరికరాలను ఎలా ఉపయోగించాలి,

# ఉగ్రవాదానికి మంగళం పలకాలి

న్యూఢిల్లీ,ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఒక చోట ఏవో అలజడులు చెలరేగుతూనే ఉన్నాయి. మానవ రుధిరం ఏరులై ప్రహహిస్తూనే ఉంది. మతం పేరుతోనో, ప్రాంతం పేరుతోనో మారణకాండ విశృంఖల విహారం చేస్తూనే ఉంది. ఒక వైపు ఉక్రెయిన్-రష్యా యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసింది. ఇజ్రాయెల్, హమాస్ దాడులు గాజాను రక్తం సిక్తం చేసాయి. పాక్ ప్రేరణతో భారత్‌లో సీమాంతర ఉగ్రవాదం ప్రబలింది. ఇటీవల పహల్గాంలో అమాయకులను ఉగ్రవాదులు అత్యంత దారుణంగా కాల్చిచంపడంతో భారత్-పాక్‌ల మధ్య తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మనుషుల ప్రాణం తీసే మానసిక ఉన్మాదం పతాక స్థాయికి చేరింది. ఇతర దేశాలను నరమేథంతో దారికి తెచ్చుకోవాలనే పరాకాష్ఠకు చేరిన పైశాచిక అకృత్యాన్ని 'ఉగ్రవాదం' గా పేర్కొనవచ్చు.ఉగ్రవాదం ఆధునిక కాలంలో కొనసాగుతున్న అత్యంత క్రూరమైన ఆటవిక చర్య. ఉగ్రవాదం భారతదేశానికి ఒక విషమ సమస్యగా మారింది. స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత కూడా భారతదేశం అనేక రూపాల్లో కొనసాగుతున్న ఉగ్రవాదం వలన నష్టపోతూనే ఉంది. దేశవిభజన సమయంలోనే అనేక విధాలుగా నష్టపోయాం.ఇప్పుడు కూడా ఉగ్రవాదం రూపంలో పరాయి మూకలు దేశాన్ని కబళించాలని చూస్తున్నాయి. ఇతరుల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను గుర్తించి గౌరవించిన దేశానికి నేటికీ కష్టాలు తప్పలేదు. బంగ్లా విమోచనకోసం పోరాడినా, లంకేయుల దేశసమగ్రత కోసం శ్రీలంకకు శాంతి సైన్యాన్ని పంపించి కాపాడినా భారత దేశానికి శత్రుబాధలు తప్పలేదు, చేదు ఫలితాలను చవిచూస్తున్నాం.పొరుగు దేశాల్లోని ఉగ్రవాదుల పంజాకు భారతదేశం మూల్యం చెల్లించుకోవడం ఇంకా కొనసాగుతూనే ఉన్నది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అదొక అనాగరిక, అమానుష ప్రక్రియగానే భావించాలి. అమాయ ప్రజల రుధిరంతో తడిసిన కర్కశమూకల వికృత ఆగడాలకు అడ్డాగా మారిన ఉగ్రవాద సంస్థలకు ఊతమిచ్చే ఏ దేశమైనా తమ పాపకృత్యాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. రాయబారాలతో, ఒప్పందాలతో రాజీపడని మనస్తత్వాలకు దండోపాయమే శరణ్యమన్న సూత్రం ఇటీవల భారత్ జరిపిన ఆపరేషన్ సందూర్ నిరూపించింది. ఉగ్రవాద శిబిరాల ధ్వంసం ఉరిమురిమి చూసే ఉగ్రదేశమైన పాకిస్తాన్‌కు ముచ్చెమటలు పట్టించింది. భారత శాంతి వచనాలను పొరుగు దేశం అసమర్థతగా భావించడం తెంపరితనం. అవసరార్థ స్నేహాలను చూసుకుని పాక్ రెచ్చిపోతే భారత్ నుంచి ప్రతిఘటన అంతకు వెయ్యి రెట్లుంటుందనే వాస్తవాన్ని దాయాది దేశం గమనించాలి.నాగరికత వెల్లివిరిసిన నేటి ప్రపంచంలో మనుషుల రక్తం తాగే ఉగ్రవాద మూకలు ఆటవిక మానవులకంటే వికృతంగా, క్రూరంగా ప్రవర్తించడం మానవత్వానికే మాయని మచ్చ. ప్రపంచమంతా ఉగ్రవాదాన్ని అసహ్యించుకుంటున్నా 'నవ్విపోదురు గాని నాకేటి సిగ్గు' అనే రీతిలో పాక్ బరితెగించింది. పాక్ ప్రభుత్వం, మిలిటరీ ఉగ్రవాదులకు అండగా నిలబడడం దౌర్భాగ్యం. ఉగ్రవాదుల పీడ వదిలించుకోలేని పాక్ ఆర్థికంగా పతనావస్థకు చేరింది. పాక్‌లో అంతర్గత సంక్షోభం విభజన దశకు చేరుకుంది. తన ఇంటిని చక్కదిద్దుకోలేని పాక్ భారత్‌ను నాశనం చేయాలను కోవడం దుర్మార్గమైన చర్య. వ్యక్తులను, వ్యవస్థలను నిర్వీర్యం చేసి, ఆర్థిక మూలాలను ధ్వంసం చేయడమే కాకుండా అమాయక ప్రజల ప్రాణాలను అలవోకగా బలితీసుకుంటూ, నిరంతరం అశాంతిని ప్రజ్వలింపచేస్తూ ఆయా దేశాలను ఆక్రమించుకోవడమో, తమ కనుసన్నల్లో మసలుకునేటట్టు చేయడమో కొన్ని దేశాలకు నిత్యకృత్యంలా మారింది.మానవత్వం నశించిన కరడుగట్టిన పైశాచిక



వాదులను సమూహాలుగా ఏర్పాటు చేసి, ఇతర దేశాల్లో మారణహోమం సృష్టించడమే ధ్యేయంగా ఏర్పాటయిన విధ్యంసకారక సంస్థలే ఉగ్రవాద సంస్థలు. ఇతర దేశాల భూభాగాలను ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో అశాంతిని సృష్టించే సామ్రాజ్యవాద శక్తులు ఒకవైపు, అకారణ కలహాలతో నిరంతరం ప్రజల ప్రాణాలను బలితీసుకుంటూ, ఏదో సాధించాలన్న తపనతో మానవత్వాన్ని మంటగలిపి, ఆ మంటల్లో చలికాచుకునే పైశాచికత్వం మరోవైపు ప్రపంచంలో ప్రబలిపోతుండడం విచారకరం. మానవత్వపు ఛాయలు విచ్ఛిన్నకారుల మనస్సుల్లో మచ్చుకైనా కానరావు. కరడుగట్టిన రాక్షసత్వమే నైజంగా బతికే ఉగ్రవాదులను విప్లవకారులుగా, సంస్కర్తలుగా కీర్తించే దేశాలను, ఉగ్రమూకలకు వత్తాసు పలుకుతూ, వారు సాగించే ఘోర హింసాకాండకు ఆర్థికంగా, నైతికంగా సహకరించే దేశాల అనైతిక పోకడలను వర్ణింపతరం కాదు. మతమౌఢ్యవాదంతోనో, సామ్రాజ్యవాదంతోనో, స్వేచ్ఛ పేరుతోనో అమాయకుల కుత్తుకలను ఖండించే దుశ్చర్యలకు పాల్పడే కర్కశవాదం నుండి పుట్టిన ఉగ్రవాదాన్ని కూకటివ్రేళ్ళతో పెకలించాయి. చాలామంది ఉగ్రవాదులకు తాము సాగిస్తున్న మారణ కాండకు సంబంధించి సహేతుకమైన కారణం కనిపించదు. ఉగ్రవాదం కూడా కొంత మందికి ఉపాధినిచ్చే ముడిసరుకుగా మారడం అత్యంతహేయం, అమానవీయం. అశాంతిని సృష్టించడం వలన సాధించేదేమీ ఉండదన్న నగ్నసత్యం ఇప్పటి వరకూ జరిగిన మొదటి, రెండవ ప్రపంచ యుద్ధ ఫలితాలు నిరూపించాయి.అమాయకుల ప్రాణాలు బలికావడం తప్ప ఉగ్రవాదుల దుశ్చర్యల వలన ఒనగూడే ప్రయోజనం శూన్యమని ప్రపంచంలో అనేక విధ్వంసాలు సృష్టించి తెరమరుగైన ఉగ్రవాద సంస్థల దృష్టాంతాలను గమనించాలి. భారత దేశం శాంతి కాముక దేశం. ఈ శాంతి వచనాల వల్ల ఇప్పటికే దేశం ఎంతో కోల్పోయింది. భవిష్యత్తులో మన దేశం ఇలాంటి శాంతి వచనాలు వల్లించడానికి సంసిద్ధంగా లేదు. వ్యూహానికి ప్రతివ్యూహం.. దెబ్బకుఎదురుదెబ్బ అన్నట్టుగా ముందుకు సాగితేనే శత్రుదేశాలు దారిలోకి వస్తాయి. చాలా కాలం నుండి మన దేశం అగ్రరాజ్యాల ఒత్తిడి వలనో, ఐక్యరాజ్య సమితి హితవచనాలు పాటించడం వలనో పొరుగు దేశాలు మన దేశాన్ని అనేక ఇబ్బందులకు గురిచేసాయి. ఎంతో మంది భారతీయ ముద్దుబిడ్డలు ఈ దేశ సమైక్యత కోసం బలి దానం గావించబడ్డారు. వారి రక్తతర్పణం వృథాగా పోలేదు. చనిపోయిన వీరుల త్యాగ ఫలం వలనే భారత దేశం సమైక్యంగా మనగలుగుతున్నది. భారత ప్రభుత్వం రాజీవ్ గాంధీ ప్రాణత్యాగం చేసిన మే 21 వ తేదీని ప్రతీ ఏటా 'జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం' గా పాటిస్తూ ఉగ్రవాదంపై అలుపెరుగని పోరు సాగిస్తున్నది.

# ఉత్తరాఖండ్‌లో విరిగిపడ్డ కొండచరియలు

డెహ్రాడూన్,ఉత్తరాఖండ్‌లో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పితోరాగఢ్ జిల్లా సమీపంలో కైలాస్ మానసరోవర్ యాత్ర మార్గంలో అవి విరిగి పడడటంతో వందలాది యాత్రికులు చిక్కుకుపోయారు. వారితోపాటు- స్థానికులు కూడా ఉన్నారు. ఆ మార్గాన్ని అందుబాటు- లోకి తెచ్చే విధంగా స్థానిక యంత్రాంగం సహాయ చర్యలు ప్రారంభించింది. శిథిలాలను తొలగించేందుకు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ బృందం అక్కడకు చేరుకుంది. తాజా ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని, అధికారులు వెల్లడించారు. పరిస్థితులు మెరుగుపడేవరకు యాత్రికులు అక్కడే ఉండాలని, సూచించారు. ఐదేళ్లుగా నిలిచిపోయిన కైలాస్ మానసరోవర్ యాత్రను ఈ ఏడాది జూన్ నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్టు- కేంద్ర ప్రభుత్వం గత నెల అధికారికంగా ప్రకటించింది. జూన్ నుంచి ఆగస్టు వరకూ కొనసాగనున్న ఈ యాత్ర ఉత్తరాఖండ్, సిక్కింలలో ప్రారంభం కానుందని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. 50 మంది యాత్రికుల చొప్పున 5 బృందాలు ఉత్తరాఖండ్ లోని లిపులేఖ్ పాస్ నుంచి, 10 బృందాలు సిక్కిం నాథులా పాస్ నుంచి ఈ యాత్రకు తరలివెళ్తాయని వెల్లడించింది. యాత్రకోసం దరఖాస్తులను ÷ఖపా.గు. లో సమర్పించ వచ్చని కంప్యూటర్ జనరేటెడ్ విధాపం ఆధారంగా యాత్రికులను ఎంపిక చేస్తామని పేర్కొంది. కొవిడ్ కారణంగా -కై-లాస్ పర్వతం, మానసరోవర్ సరస్సు యాత్ర 2020 లో ఆగిపోయింది. ఆ తర్వాత గల్వాన్ కారణంగా భారత్, చైనాల మధ్య సంబంధాలు దెబ్బతినడంతో యాత్ర పునరుద్ధరణ చర్యలు ముందుకు సాగలేదు. గత ఏడాది రష్యాలో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల భేటీ- అనంతరం ఇరు దేశాల సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చే చర్యలు మొదలయ్యాయి

## అశోక యూనివర్సిటీ ప్రొఫెసర్ అరెస్ట్

న్యూఢిల్లీ,ఆపరేషన్ సిందూర్‌పై వివాదాస్పద పోస్ట్ చేసిన అశోక యూనివర్సిటీ-ప్రొఫెసర్‌ను హర్యానా పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం సోనేపట్ కోర్టులో ప్రవేశపెట్టి ఏడు రోజుల రిమాండ్‌ను కోరగా.. 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ప్రొఫెసర్ అలీ ఖాన్ మహ్మదాబాద్.. పహల్గామ్ దాడి తర్వాత పాకిస్తాన్‌లో భారత్ సైనిక చర్య, ఆపరేషన్ సిందూర్‌పై వివాదాస్పద పోస్ట్ చేశారు. ఆపరేషన్ సిందూర్ గురించి కల్నల్ ఖురేషి, వింగ్ కమాండర్ సింగ్ మీడియా సమావేశాలను ఉద్దేశిస్తూ.. వంచన అని అభివర్ణించారు. ఆయన సోషల్ మీడియా పోస్ట్ సాయుధ దళాలను, ఆపరేషన్ సిందూర్‌పై మీడియా సమావేశాలకు ప్రధాన ప్రతినిధిగా ఉన్న మహిళా అధికారులు, కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లను విమర్శించేదిగా, అగౌరవపరిచేదిగా ఉందని హర్యానాలోని బిజెపి యువ మోర్చా ప్రధాన కార్యదర్శి యోగేష్ జతేరి ఫిర్యాదు మేరకు అరెస్టు చేశారు. హర్యానా రాష్ట్ర మహిళా కమిషన్ కూడా ప్రత్యేక కేసు దాఖలు చేసింది. అయితే, ప్రొఫెసర్ తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని, కేవలం తన రాజ్యాంగ స్వేచ్ఛా హక్కును ఉపయోగించుకుంటు-న్నానని మహ్మదాబాద్ చెప్పాడు.

## వోల్గా ఆర్చరీ అకాడమీకి ఆర్చరీ ఉపకరణాలు

విజయవాడ,వోల్గా ఆర్చరీ అకాడమీకి రూ. 1.16 లక్షల విలువైన ఆర్చరీ ఉపకరణాలను అమరావతి బోటింగ్ క్లబ్ ప్రతినిధులు కలెక్టర్ లక్ష్మీశ చేతులమీదుగా అందించారు. విలువిద్యలో క్రీడాకారులకు మరింత నైపుణ్యాలను అందించి.. వచ్చే ఒలింపిక్ క్రీడల్లో వోల్గా ఆర్చరీ అకాడమీలో శిక్షణ పొందిన క్రీడాకారులు పతకాన్ని సాధించడమే లక్ష్యంగా శిక్షణ అందించి.. నగరానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని, పీ 4 విధానం స్ఫూర్తితో క్రీడా పరికరాలను అందించేందుకు ముందుకొచ్చిన అమరావతి బోటింగ్ క్లబ్ ప్రతినిధులను అభినందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వీరు క్రీడా పరికరాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనదగ్గర ప్రతిభ ఉన్న విలువిద్య క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారని.. వారికి మరింత నాణ్యమైన శిక్షణ అందిస్తే ఒలింపిక్‌తో పాటు- వివిధ అంతర్జాతీయస్థాయి పోటీ-ల్లోనూ రాణించే సత్తా ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పీ4 విధానాన్ని స్ఫూర్తిగా తీసుకొని వోల్గా ఆర్చరీ అకాడమీకి అమరావతి బోటింగ్ క్లబ్ మార్గదర్శిగా సహాయం అందించినట్లు- తెలిపారు. ఆర్చరీ అకాడమీ ఎలాంటి లాభాపేక్ష లేకుండా శిక్షణ అందిస్తూ మట్టిలోని మాణిక్యాలను వెలికితీస్తోందని.. ఈ నేపథ్యంలో బంగారు కుటుంబమైన అకాడమీకి సహాయమందించేందుకు బోటింగ్ క్లబ్ ముందుకొచ్చినట్లు- కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. కార్యక్రమంలో అమరావతి బోటింగ్ క్లబ్ (ఏబీసీ) సీఈవో తరుణ్ కాకాని, వోల్గా ఆర్చరీ అకాడమీ చీఫ్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ, ఆర్చరీ నేషనల్ కమిటీ- సభ్యులు బీవీ రమణ, జిల్లా టెజరర్ జి.ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సుపై ఆత్మాహుతి దాడి..

న్యూఢిల్లీ,ఉగ్రవాదులు మరోసారి అమాయక ప్రజలపై దాడులకు పాల్పడ్డారు. పాకిస్థాన్ లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఒక స్కూల్ బస్సును లక్ష్యంగా చేసుకుని బాంబు దాడి చేశారు. ఈ ఘటనలో నలుగురు పిల్లలు అక్కడికక్కడే మరణించగా, మరో 38 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ పేలుడును అక్కడి హోంమంత్రి మొహ్సిన్ నఖ్వీ తీవ్రంగా ఖండించారు. మరోవైపు అధికారులు ఈ దాడి ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. సమాచారం ప్రకారం, స్కూల్ బస్సు పిల్లలను తీసుకెళ్తున్నప్పుడు ఈ దాడి జరిగింది. పేలుడు జరిగిన వెంటనే సహాయ, రక్షణ చర్యలు ప్రారంభ మయ్యాయి. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన పిల్లలను క్వెట్టా, కరాచీలోని పెద్ద ఆసుపత్రులకు తరలిం చారు. పాకిస్థాన్ హోం మంత్రి మొహ్సిన్ నఖ్వీ ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ పిల్లలను లక్ష్యంగా చేసుకునే ఉగ్రవాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్ట బోమన్నారు. దేశంలో భయాన్ని, అస్థిరతను వ్యాప్తి చేయడమే వారి దాడి ఉద్దేశమని, అయితే ప్రభుత్వం, భద్రతా దళాలు వీటిని విజయవంతం చేయనివ్వవని వెల్లడించారు. బలూచిస్తాన్ చాలా కాలంగా పాకిస్థాన్?కు అత్యంత సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతంగా ఉంది. ఇక్కడి వేర్పాటువాద శక్తులు పాకిస్థాన్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశాన్ని కోరుతున్నాయి. ఈ క్రమంలో అనేకసార్లు పాకిస్థాన్ సైన్యాన్ని, పలువురని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయి. ఇటీవలి సంవత్సరాలలో ఈ ప్రాంతంలో ఉగ్రవాద ఘటనల సంఖ్య భారీగా పెరగడం విశేషం. ఈ క్రమంలోనే బలూచిస్తాన్‌లో జరిగిన ఈ ఆత్మాహుతి దాడి పాకిస్థాన్ అంతర్గత భద్రతపై మరోసారి ప్రశ్నలను లేవనెత్తింది. గత కొద్ది సంవత్సరాలుగా ఈ ప్రాంతం బలోచ్ వేర్పాటువాదులకదలికలతో దద్దరిల్లిపోతోంది. ముఖ్యంగా బలోచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ పేరుతో విప్లవకారులు పదే పదే పేలుళ్లు, కాల్పుల ద్వారా ప్రభుత్వాన్ని గడగడలాడిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం కిల్లా అబ్దుల్లా నగరంలోని మార్కెట్ వద్ద కార్ బాంబ్ పేలుడులో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇది ఒక్కటే కాదు, మార్చిలో జరిగిన ఘోర ఘటనలో, ఓ రైలు పై దాడి చేసి 33 మందిని, ప్రధానంగా సైనికులను హతమార్చింది.

## 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర

విజయవాడ,సుసంపన్న, ఆరోగ్య, ఆనందమయ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారం దిశగా ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార, జనజాగృతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. బుధవారం కృష్ణానదీ తీరాన హరిత బెరం పార్కు-పున్నమిఘాట్‌లో ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగాంధ్ర మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఇందులో వివిధ శాఖల అధికారులు, యోగా ఔత్సాహికులు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొనగా యోగా ట్రైనర్ రామాంజనేయులు యోగా ప్రయోజనాలతో పాటు పతంజలి యోగ సూత్రాలను వివరించి, యోగాభ్యస నాలు చేయించారు. అనంతరం కృష్ణబాబు మాట్లాడుతూ భారతీయ వారసత్వ, ప్రాచీన సంపదను అందరికీ అందించాలనే ఉద్దేశంతో గౌరవ ప్రధానమంత్రి చొరవ కారణంగా ఐరాస తీర్మానంతో తొలిసారిగా 2015, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరిగాయి.. ఈ ఏడాది విశాఖలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు గౌరవ ప్రధాని రానున్నట్లు తెలిపారు. యోగా ప్రయోజనాలపై అవగాహన పెంపొందించుకొని, జీవితాంతం ప్రజలు తమ జీవన మార్గంలో యోగాను భాగం చేసుకునేలా ప్రోత్సహించేందుకు గౌరవ ముఖ్యమంత్రి మార్గనిర్దేశనరతో నెలరోజుల పాటు ఊరూవాడా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దాదాపు రెండు కోట్ల మంది ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు కృషిచేస్తున్నామన్నారు. నిపుణులు రూపొందించిన 45 నిమిషాల నిడివితో ఉన్న కామన్ యోగా ప్రోటోకాల్ ఆధారంగా ఔత్సాహికులకు శిక్షణ ఇవ్వనున్నామని.. వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నామని కృష్ణబాబు తెలిపారు. శిక్షణ పొందిన వారిద్వారా ప్రతి గ్రామంలో, వార్డులో ప్రజలకు యోగాభ్యసనతో శారీరక, మానసిక ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించడంతో పాటు అభ్యసన చేయించడం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్‌కు వీలుగా ప్రత్యేక యాప్‌ను రూపొందించడం జరిగిందని, పోర్టల్ కూడా అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి జిల్లాలో కనీసం నాలుగు పర్యాటక ప్రాంతాల్లో రాష్ట్రం మొత్తంమీద దాదాపు 100 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. థీమ్ ఆధారిత కార్యక్రమాలతో ప్రతి వర్గానికి యోగాను చేరువచేయడంలో సమష్టి భాగస్వామ్యం అవసరమని.. అందరం కలిసి యోగాంధ్రను విజయవంతం చేద్దామని కృష్ణబాబు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర సాకారం దిశగా యోగాంధ్ర ఓ గొప్ప ముందడుగు అని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. నెల రోజుల యోగాంధ్ర కార్యాచరణలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. బాపూ మ్యూజియం, కొండపల్లి ఖిల్లా, గాంధీ హిల్ వంటి చారిత్రక, పర్యాటక ప్రాంతాల్లోనూ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ప్రతిఒక్కరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని యోగాకు కేటాయించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని కలెక్టర్ వివరించారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా యోగా విశిష్టతను రాష్ట్రం నలుమూలలా వ్యాప్తి చెందేలా యోగాంధ్ర ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకుంటే మనం చేసే ప్రతి పని ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. యోగాతో జీవనశైలిని మార్చుకొని ఒత్తిడిని దూరం చేసుకొని ఆనందమయ జీవితాన్ని పొందుదామని పేర్కొన్నారు. నేటి ఆధునిక జీవనశైలిలో ఫిట్‌నెస్‌ను పెంపొందించుకోవడం సవాలుగా మారిందని, ఈ నేపథ్యంలో ఒత్తిడిని అధిగమించి, రోజువారీ జీవితంలో వెలుగులు నింపుకునేందుకు ప్రతిఒక్కరూ రోజూ కనీసం అరగంట యోగాభ్యసనాలు, ధ్యానం చేయాలని విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం సూచించారు. యోగాంధ్రలో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ప్రత్యేక అవగాహన, యోగాభ్యసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా ఆయుష్ శాఖ అధికారి డా. రామత్లేహి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి కట్టిన ఆ మూడు దేశాలు?

సెంట్రల్ డెస్క్:2021లో అజర్‌బైజాన్ రాజధాని బాకులో జరిగిన ఒక ముఖ్యమైన సమావేశంలో పాకిస్తాన్, టర్కీ, అజర్‌బైజాన్ అధినేతలు తమ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ సమావేశంలోనే "త్రీ బ్రదర్స్ అలయన్స్" పేరుతో ఒక అనధికారిక కూటమి ఏర్పడింది. ఈ మూడు దేశాల మధ్య చారిత్రాత్మక, సాంస్కృతిక సంబంధాలున్నాయి. టర్కీ, అజర్‌బైజాన్ దేశాలు టర్కిక్ (తురుష్కులు) వారసత్వాన్ని కలిగి ఉన్నాయి. ఈ కూటమిని కలిపే కీలకమైన అంశం మతం. ఈ మూడూ మెజారిటీ ఇస్లామిక్ దేశాలు కావడం గమనార్హం.టర్కీ అధ్యక్షుడు రెసెప్ ఎర్డోగాన్ ఈ కూటమి వెనుక ప్రధాన శక్తిగా ఉన్నారు. టర్కీ ప్రభావాన్ని విస్తరించడానికి, ఎర్డోగాన్ తన దేశంతో సన్నిహిత సంబంధాలు కలిగిన దేశాలతో సహకారాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కూటమి మూడు దేశాలకు పరస్పర ప్రయోజనాలను అందించింది. ఉదాహరణకు 2020 నాగోర్నో-కరబాఖ్ సంఘర్షణలో అజర్‌బైజాన్ దేశానికి టర్కీ సైనిక మద్దతు అందించింది. ఫలితంగా ఆర్మేనియాపై అజర్‌బైజాన్ విజయం సాధించడంలో సహాయపడింది. అదేవిధంగా 1950ల నుండి పాకిస్తాన్ టర్కీతో సన్నిహిత రక్షణ సంబంధాలను కలిగి ఉంది.దీని ద్వారా క్రూయిజ్ మిస్సైల్స్,డ్రోన్లు,ఇతర ముఖ్యమైన సైనిక సాంకేతికతను పొందింది.

సైనిక సహకారం, కాశ్మీర్ సమస్యపై మద్దతు

2021లో ఈ మూడు దేశాలు "త్రీ బ్రదర్స్" సైనిక విన్యాసాన్ని ప్రారంభించాయి. సైనిక సమన్వయాన్ని మెరుగుపరచుకున్నాయి. ఈ కూటమి దేశాలు ఒకరి ప్రాదేశిక వివాదాలలో మరొకరికి మద్దతు ఇస్తాయి. అంటే.. కాశ్మీర్ సమస్యపై పాకిస్తాన్ విధానానికి టర్కీ, అజర్‌బైజాన్ మద్దతు ఇస్తాయని దానర్థం. టర్కీ ఐక్య రాజ్య సమితి వంటి వేదికలపై కాశ్మీర్ సమస్యను పదేపదే లేవనెత్తింది. ఇది భారతదేశాన్ని తీవ్రంగా కలవరపరిచింది. పహల్‌గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో అజర్‌బైజాన్, టర్కీ రాజకీయంగా పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చాయి. భారతదేశంపై దాడుల్లో టర్కీ అందజేసిన డ్రోన్లను పాకిస్తాన్ ఉపయోగించింది. ఇది ఈ కూటమి యొక్క సైనిక సహకార తీవ్రతను సూచిస్తుంది.

ఈ కూటమి ఎందుకు ఆందోళన కలిగిస్తుంది?

ఒబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ కు చెందిన కబీర్ తనేజా మాట్లాడుతూ "ఈ కూటమి చాలా కాలంగా ఉంది. ఇది భారతదేశానికి భౌగోళిక రాజకీయ సమస్యగా మారింది. కానీ అంతర్జాతీయ స్థాయిలో ఇది భారతదేశానికి పెద్ద సమస్య అని నేను అనుకోను" అని అన్నారు. అయితే టర్కీ, అజర్‌బైజాన్ రెండూ పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పెట్టడం లేదని ఆయన సూచించారు. అయినప్పటికీ భారతదేశం ఈ కూటమికి రాజకీయంగా ప్రతిస్పందించాల్సిన అవసరం ఉందని తనేజా వాదించారు.

# 'అఖిలపక్షం వేళ' అనైక్యత!




న్యూఢిల్లీ,దేశం కోసం సమష్టిగా కదలాల్సిన సందర్భాల్లో సైతం కలవలేనంతగా అధికార విపక్షాలు ఎడ మొహం పెడమొహంగా మారాయి. పెహల్‌గామ్‌లో గత నెల 22న ఉగ్రవాదులు సాగించిన మారణ కాండ మొదలు మన ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్, ఈ నెల 10న కాల్పుల విరమణ, పాకిస్తాన్ దురాలోచనలూ వగైరా ప్రపంచానికి తెలియజెప్పేందుకు అధికార, విపక్ష ఎంపీలతో ఏర్పాటు చేసిన ఏడు అఖిలపక్ష బృందాల కూర్పు ప్రక్రియ వివాదాస్పదంగా మారటం దీన్ని చాటుతోంది. మన దేశంనుంచి సమష్టి స్వరం వినబడితే దాని ప్రభావం వేరుగా వుంటుంది. పాకిస్తాన్ సైతం ఇదే తరహాలో అఖిలపక్ష ప్రతినిధి బృందాలను పంపటానికి సన్నాహాలు చేసుకుంటున్నది. కనీసం ఇందుకోసమైనా విభేదాలు పక్కనబెట్టి ఒక్కటై నిలబడదామన్న స్పృహ అటూ ఇటూ కరువవుతోంది. ఏ దేశంలోనూ ఇలా వుండదు. అమెరికాలో ప్రపంచ వాణిజ్య కేంద్రం (డబ్ల్యూటీసీ)పై ఉగ్రదాడి మొదలు ఇందుకు ఎన్నయినా ఉదాహరణలివ్వొచ్చు. 'ఉగ్రవాదంపై యుద్ధం' పేరుతో అమెరికా అఫ్గాన్‌ను వల్లకాడు చేసింది. చివరకు ఒరిగిందేమీ లేదు. అఫ్గాన్‌నుంచి అవమానకరంగా నిష్క్రమించాల్సి వచ్చింది. అయినా అక్కడి విపక్షం మౌనంగా ఉండిపోయింది. కానీ ఇక్కడలా కాదు. యూపీఏ హయాంలో ముంబైపై ఉగ్రదాడి, దానికి వెనకాముందూ జరిగిన అనేకానేక ఉదంతాల్లో మన దేశంలో అధికార పక్షంపై విపక్షం విరుచుకుపడటం, యక్షప్రశ్నలు వేసి ఇరుకున పడేసే ప్రయత్నం చేయటం రివాజుగా మారింది. యూపీఏ హయాంలో బీజేపీ విపక్షంలోవుండి ఏం చేసేదో, ఇప్పుడు కాంగ్రెస్ సైతం ఆ పనే చేస్తోంది. పుల్వామా ఉగ్రదాడి సమయంలో మరీ దారుణం. జవాన్ల త్యాగాలూ, వారు దెబ్బకు దెబ్బ తీసిన వైనమూ 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో చర్చనీయాంశంగా మారటం ఆశ్చర్యపరిచింది. ఈ ఉదంతాలను బీజేపీ తనకను కూలంగా మలుచుకునే ప్రయత్నం చేయగా, ప్రభుత్వ వైఫల్యంపై విపక్షం చాటింపు వేసింది. అయితే మన దేశంలోనూ ఒకప్పుడు అధికార, విపక్షాలు కలిసికట్టుగా పనిచేసిన ఉదంతాలు లేకపోలేదు. ఇందుకోసం ఎన్నడో 1971 నాటి భారత్-పాక్ యుద్ధం వరకూ పోనవసరం లేదు. 1994లో కశ్మీర్‌పై భారత్ వైఖరిని వివరించటానికి నాటి ప్రధాని పీవీ నరసింహారావు రూపొందించిన అఖిలపక్ష బృందానికి నేతృత్వం వహించింది అప్పటి విపక్ష నేత అటల్ బిహారీ వాజపేయి! పాతికేళ్ల క్రితం కార్గిల్ యుద్ధ సమయంలో నాటి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమూ, కాంగ్రెస్‌తోసహా విపక్షాలూ దేశభద్రత కోసం కలిసికట్టుగా పనిచేశాయి. కానీ ఇప్పుడెందుకు పరస్పరం తప్పులు వెదుక్కొనే తాపత్రయాన్ని ప్రదర్శిస్తున్నట్టు? దేశంలో తక్షణం వచ్చే ఎన్నికలేమీ లేవు. అయినా పెహల్‌గామ్‌ను రాజకీయంగా వినియోగించుకోవటానికి అటూ ఇటూ పోటీపడుతున్నారు. త్రివిధ దళాల అధికార ప్రతినిధులు చెప్పేవరకూ ఆగకుండా ఇష్టానుసారం ఉన్నవీ లేనివీ ప్రచారం చేసి, విపక్షాలను పాకిస్తాన్ అనుకూలురుగా, దేశద్రోహులుగా చూపటానికి బీజేపీ శ్రేణులూ, సాను భూతిపరులూ చేయని ప్రయత్నం లేదు. తొలి ప్రధాని నెహ్రూ ఉదారంగా పాకిస్తాన్‌కు నదీజలాలు, భారీయెత్తున సొమ్ము కట్టబెట్టారని బీజేపీ నేతలు ఇంకా ఆరోపణలు గుప్పిస్తూనే వున్నారు. ఒకపక్క అఖిలపక్షాన్ని పంపుతూ మాట్లాడాల్సిన మాటలేనా ఇవి? వీటిని ఎలా ఎదుర్కొనాలో తెలియక ఇష్టానుసారం మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు చులకనవుతున్నారు. యుద్ధ విమానాలు ఎన్ని కూలాయి... మనవైపు జరిగిన నష్టమెంత అంటూ రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ఇవి అడగకూడని ప్రశ్నలేమీ కాదు... కానీ అందుకు తగిన వేదికను ఎంచుకోవాలని కూడా ఆయనకు తోచదు. ఇంతకూ అఖిలపక్ష బృందాల కూర్పుపై ఇంత వివాదం ఎందుకొచ్చినట్టు? విపక్షాలను విశ్వా సంలోకి తీసుకుని, వారు పంపిన పేర్లనుంచి ఎంపికచేసే కనీస మర్యాద అధికార పక్షం పాటించివుంటే సమస్య తలెత్తేది కాదు. విపక్షానికి ఆలోచించే శక్తిసామర్థ్యాలు లేవన్నట్టు సర్కారు ప్రవర్తించింది. కాంగ్రెస్ పార్టీ నలుగురు సభ్యుల పేర్లు పంపితే వారిలో ఒక్కరినే ఎంపిక చేసింది. పోనీ సర్కారు ఎంచుకున్నది కూడా సమర్థుల్నే కదా అనే సర్దుబాటు ధోరణి కాంగ్రెస్‌కు లేదు. అసలు ఆ పార్టీ నుంచి వెళ్లిన జాబితాలో సల్మాన్ ఖుర్షీద్, శశిథరూర్, మనీష్ తివారీ తదితరుల పేర్లు ఎందుకు లేకుండా పోయినట్టు? సీనియర్ నేత ఖుర్షీద్‌ను ఎంపిక చేసిన ప్రభుత్వం తీరా ఆయన సీనియారి టీని కాదని జేడీ(యూ) నేత సంజయ్ ఝాకు సారథ్య బాధ్యతలు ఎందుకిచ్చినట్టు? సమష్టి స్వరం వినబడాల్సిన ఈ సమయంలో ఇన్ని లుకలుకలుండటం మంచిదేనా? ఇంత రాద్ధాంతం చేసిన కాంగ్రెస్ చివరకు ఈ వివాదాన్ని పొడిగించదల్చుకోలేదని చేతులెత్తేసింది. కానీ ఎప్పుడూ వీరంగం వేసే అలవాటున్న తృణమూల్ మాత్రం ప్రభుత్వం ఎంపిక చేసిన సభ్యుణ్ణి తప్పుకోమని చెప్పింది. దాంతో ప్రభుత్వం తగ్గి ఆ పార్టీ అధినేత మమతా బెనర్జీ సూచించిన నేతకు స్థానం కల్పించింది. అఖిలపక్షం పంపటంలోని ఉద్దేశమే సమష్టితత్వాన్ని, ఈ దేశ సంకల్పాన్ని, పాకిస్తాన్ కుయుక్తులను చాటడానికైనప్పుడు సభ్యుల ఎంపిక వివాదాస్పదం కాకుండా ప్రభుత్వం చూడాల్సింది. ఈమధ్య ఆపరేషన్ సిందూర్ మొదలుకొని పార్టీ వైఖరికి భిన్నంగా పలు ప్రకటనలిస్తూ సంచలనం సృష్టిస్తున్న శశిథరూర్‌ను కాంగ్రెస్ ఎంపిక చేయకపోవటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ ఆయన్ను ఏరికోరి ఎంపిక చేయటం కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టడానికేనన్న విషయంలో ఎవరికీ సందేహం అక్కర్లేదు. ఏదేమైనా ఇలాంటి సంక్షోభ సమయాల్లో అవసరమైన సంయమనం, హుందాతనం ఇరువైపులా కనబడకపోవటం దురదృష్టకరం.

## లుఫ్తాన్సా విమానానికి తప్పిన ప్రమాదం

హైదరాబాద్,శంషాబాద్ ఎయిర్‌పోర్టులో లుఫ్తాన్సా విమానానికి తృటిలో ప్రమాదం తప్పింది. ఉదయం ఫ్రాంక్‌ఫర్ట్ బయలుదేరిన విమానం రన్ వే మీదకు వెళ్లిన వెంటనే ముందు టైరులో సమస్య ఏర్పడింది. ఈ విషయాన్ని పైలట్ వెంటనే గుర్తించారు. దీంతో ఈ విషయాన్ని ఎయిర్ పోర్ట్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. అనంతరం వారి సూచన మేరకు విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోకి మళ్లించారు. ఈ సమయంలో విమానంలో 190 మంది ప్రయాణికులు ఉన్నారు. విమానం టైర్‌ను ఎయిర్ పోర్టులోని సాంకేతిక సిబ్బంది పరిశీలిస్తున్నారు. మరోవైపు కొన్ని గంటల ఆలస్యంగా ఈ విమానం బయలుదేరుతోందని ఎయిర్‌పోర్ట్ అధికారులు వెల్లడించారు.

# కిరానా హిల్స్ అణుస్థావరమా...లేక అమెరికా అణ్వాయుధ నిల్వలా

న్యూఢిల్లీ,పాకిస్థాన్ సర్గోదా జిల్లాలోని కిరానా హిల్స్‌లో అణు దాడులకు ఉపయోగించే టాక్టికల్ న్యూక్లియర్ వార్‌హెడ్‌లను ఉంచినట్లు వెలువడిన కథనాల పట్లనే మొత్తం ప్రపంచం నేడు దృష్టి సారిస్తోంది. ఇంతకూ ఇవి పాక్‌కు చెందినవా లేక, అమెరికా ఇక్కడ దాచిందా అన్న ప్రశ్న వస్తోంది. అంతర్జాతీయ సమాజం కూడా దీనిపై అనుమానాలు వ్యక్తం చే÷-తోంది. కిరానాహిల్స్ సమీపంలో అణుస్థావరాలపై భారత్ వైమానిక దాడుల తరవాతనే హఠాత్తుగా పాక్ కాల్పుల విరమణ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ట్రంప్ కూడా దీనిని సమర్థించారు. అందుకే ఇప్పుడు పాక్, అమెరికాల తీరుపై అనుమానాలు వస్తున్నాయి. పాక్‌కు అనుకూలంగా అమెరికా మాట్లాడడం కూడా అనుమానాలు కలిగిస్తున్నాయి. ఎందుకంటే కిరానాహిల్స్‌కు దాదాపు 20 కిలోమీటర్ల దూరంలోనే ముసఫ్ ఎయిర్ బేస్ ఉంది. భారత్ దాడి చేసిన 11 ఎయిర్ బేస్‌లలో ఇది ఒకటి. ఇక్కడి నుంచి కిరానా హిల్స్‌కు కనెక్షన్ ఉందని అంటున్నారు. దీంతో ఇక్కడే వార్‌హెడ్లకు నష్టం జరిగి రేడియో యాక్టివ్ రిలీజ్ అయ్యి ఉండొచ్చని విశ్లేషణలు వెలువడు తున్నాయి. ఇక్కడే భారీ విధ్వంసం సృష్టించే అణు దాడులు చేసే స్ట్రాటజిక్ న్యూక్లియర్ వార్‌హెడ్లను పాక్ నిల్వచేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెలవరించింది. ఈ నేపథ్యంలో ఇక్కడ అణుధార్మికత వెలువడి ఉండవచ్చున్నది ఆ కథనాల సారాంశం. అమెరికాకు చెందిన సిఐఎ మాజీ అధికారి డెరెక్ గ్రాస్మన్ కూడా ఈ వాదనను బలపర్చారు. ఇదే సందర్భంలో పాకిస్తాన్‌లోని ఎయిర్ బేస్‌లపై భారత్ దాడి చేసిన తర్వాత అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనర్జీకి చెందిన న్యూక్లియర్ ఎమర్జెన్సీ సపోర్ట్ ఎయిర్ క్రాఫ్ట్ బి350 ఎంఎంఎస్ పాక్ గగనతలంలోకి వచ్చినట్లు పలు అంతర్జాతీయ వార్తా సంస్థలు కథనాలు ప్రచురించాయి. ఈ విమానం ద్వారా రేడియోధార్మిక యాక్టివిటీని అంచనా వేస్తారు. అణు కర్మాగార ప్రమాదాల తర్వాత రేడియేషన్ లీక్‌లను పర్యవేక్షించడం, రేడియో లాజికల్ సంఘటనల సమయంలో అత్యవసర సేవలకు ఈ విమానాన్ని మోహరిస్తారు. ఈ పరిణామాలు అన్నింటిని లోతుగా విశ్లేషణ జరిపితే భారత్‌పై అణ్వస్త్రాలను ఉపయోగించే ప్రయత్నం పాకిస్తాన్ చేసిన దాఖలాలు కనిపించకపోయినా కిరానా హిల్స్ ప్రాంతంలో అణ్వాయుధ స్థావరం నెలకొన్నట్లు మాత్రం స్పష్టం అవుతుంది. అయితే, అమెరికా ఆదుర్దాగా ఈ విషయంలో స్పందించడం బట్టి చూస్తుంటే ఈ స్థావరం పాకిస్థాన్‌కు చెందింది కాకపోవచ్చని, అమెరికాకు సంబంధించినది కావచ్చనే అనుమానాలు బలంగా వ్యాపిస్తున్నాయి. కిరానా హిల్స్‌కు సంబంధించిన చిత్రాలను గూగుల్‌లో వెడల్పుగా చేసి చూస్తుంటే అక్కడ భూగర్భంలో భారీ స్థావరాలు ఉన్నట్లు స్పష్టం అవుతుంది. ఒక చిత్రంలో 2019 అక్టోబర్‌లో పాకిస్తాన్‌లోని కిరానా హిల్స్‌లోని అటువంటి అణు బంకర్లలో ఒకదానిలోకి ఏదో ఒకటి తీసుకువెళుతున్న దృశ్యం కనిపిస్తుంది. సుమారు 150 విశాలమైన బంకర్లు ఉన్నట్లు, ఒకొక్క బంకర్ ద్వారమే 120 మీటర్ల వరకు ఉన్నట్లు చిత్రాలు కనిపిస్తున్నాయి. ఆ బంకర్లు బలమైన లోహాలతో తయారు చేసి ఉండవచ్చని, వాటిని ఇసుకతో కప్పి, చెట్లు వచ్చే విధంగా చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రపంచంలో బహుశా మరెక్కడా ఇంతటి భారీ బంకర్లు, విశాలమైన ప్రాంగణాలలో సైనికులకు లేకపోవచ్చని కూడా అంచనా వేస్తున్నారు. అంతటి భారీ బంకర్లను నిర్మించే సామర్థ్యం, ఆర్థికంగా వెసులుబాటు పాకిస్తాన్‌కు ఉండే అవకాశం లేదని, అమెరికా స్వయంగా తన సైనిక ప్రయోజనాలకోసం నిర్మించుకొని ఉండవచ్చనే అనుమానాలు కూడా ఈ సందర్భంగా కలుగుతున్నాయి. పైగా, వ్యూహాత్మకంగా కిరానా హిల్స్ భౌగోళిక ప్రాంతం




నెలకొన్న ప్రాధాన్యత కూడా ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రపంచంలో అమెరికా తర్వాత అతి పెద్ద సైన్యం కలిగిన రష్యా, చైనా దేశాలు ఇక్కడకు సమీపంలో ఉన్నాయి. ఇక్కడి నుండి దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాలపై క్షిపణులు, అణ్వస్త్రాలను ప్రయోగించేందుకు సౌలభ్యంగా ఉంటుంది. ముఖ్యంగా ప్లూటోనియం డర్టీ బాంబులను ఉపయోగించి మొత్తం భారతదేశపు సామర్థ్యంపై రేడియేషన్ ప్రభావం కలిగించే అవకాశం ఉంటుంది. అంటే సగానికి పైగా ప్రపంచంపై సైనికంగా ఆధిపత్యం వహించేందుకు వ్యూహాత్మకంగా అనుకూలంగా ఉండే ప్రాంతంగా రక్షణ రంగ నిపుణులు భావిస్తున్నారు.మరోవంక, తమ దేశ అణ్వస్త్రాలపై భారత్ దాడి చేసిందని ఒప్పుకుంటే అంతర్జాతీయ వేదికపై తమ పరువు పోతుందన్న ఆలోచనలో దాయాది దేశం ఉన్నట్లు నిపుణులు అంటున్నారు. అంతేకాదు, ఈ అంశంపై దేశ ప్రజలకు కూడా సమాధానం చెప్పాల్సి వస్తుందని పాకిస్తాన్ భయపడి ఉండొచ్చని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఎందుకంటే, న్యూక్లియర్ వార్‌హెడ్స్ కూడా రక్షించుకోలేనంత శక్తిహీనంగా పాలకులు తయారయ్యారని స్వదేశంలోనే ఇబ్బందికర పరిస్థితి తలెత్తే అవకాశం ఉంది. దానితో కిరానా హిల్స్‌లో వాస్తవ పరిస్థితిని ప్రపంచానికి తెలియకుండా దాచిపెడుతున్నట్లు తెలుస్తోంది. అందుకనే కిరానా హిల్స్‌లో అణ్వస్త్రాలు ఉన్నాయనే కథనాలు అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే, ఈ కథనాలపై పాకిస్తాన్‌తో పాటు అమెరికా, చైనా, రష్యా వంటి దేశాలు సహితం మౌనం వహిస్తూ ఉండటం గమనార్హం. భారత్ కేవలం పాకిస్తాన్ అణ్వస్త్రాలు ప్రయోగించే ప్రయత్నం చేయలేదని మాత్రమే చెప్పింది గాని, అక్కడ అటువంటి ఆయుధాలు లేవని మాత్రం చెప్పడం లేదు. పైగా ఈ పరిణామాలపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆందోళన వ్యక్తం చేస్తూ ఆ దేశంలోని అణ్వస్త్రాలను ఐఎఇఎ పర్యవేక్షణ కిందకు తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదానికి నిలయంగా ఉన్న దేశంలో అణ్వస్త్రాలు ప్రపంచ శాంతికి ప్రమాదకారి కాగలవని ఆయన హెచ్చరించారు. కానీ, ఆయన వ్యక్తం చేసిన ఆందోళనలపై పాకిస్తాన్ సైతం స్పందించే ప్రయత్నం చేయడం లేదు. ఈ విషయమై ఇప్పటి వరకు తాము అణ్వస్త్రం గల దేశం అంటూ భారత్‌ను బెదిరిస్తూ వస్తున్న పాకిస్తాన్ తాజా ఘటనలతో వాటిని నేలమట్టం చేయగల సామర్థ్యం భారత్‌కు ఉందనే సంకేతం ఇచ్చినట్లయింది. పాకిస్తాన్‌కు అణుదాడి ఆలోచన వచ్చే లోపే ఆ స్థావరాలను నామరూపాల్లేకుండా చేస్తామన్న సంకేతాలను భారత్ ఇచ్చినట్టు కావడంతో భారత్ చేసిన ఈ హెచ్చరికను పాకిస్తాన్ బహిరంగంగా ఒప్పుకోలేక మౌనం పాటిస్తుందా? అనే అనుమానం కూడా కలుగుతోంది.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు 500 ఎకరాలు

అమరావతి,:భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు 500 ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అమరావతిలో లా యూనివర్సిటీ ఏర్పాటు జరగనుందని, బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏలూరులో ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. టూరిజం పాలసికి లోబడి కొన్ని ప్రాజెక్ట్‌లు వస్తాయని, వైజాగ్ త్వరలో అద్భుత నగరం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం ఏపీ మంత్రివర్గ సమావేశం జరిగింది. కేబినెట్ భేటీ- అనంతరం నిర్ణయాలను మంత్రులు పార్థసారథి, నాదెండ్ల మనోహర్ మీడియాకు వెల్లడించారు. మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ... 'కూటమి ప్రభుత్వం లక్ష్యం ఐదేళ్ల కాలంలో 20 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఇవ్వడం. ఎస్ఐపీబీ సమావేశం తీస్కున్న నిర్ణయాలను క్యాబినెట్ ఆమోదించింది. టూరిజం పాలసికి లోబడి కొన్ని ప్రాజెక్ట్‌లు వస్తాయి వైజాగ్ త్వరలో అద్భుత నగరం అవుతుంది. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు 500 ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మాదిరి అనేక సౌకర్యాలు ఉంటాయి. అమరావతిలో లా యూనివర్సిటీ- ఏర్పాటు- జరగనుంది. బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ- ఏలూరులో ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ప్రధాన కేంద్రాన్ని రాజమండ్రిలో ఏర్పాటు-చేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. సౌర విద్యుత్, పవన విద్యుత్ ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం. త్వరలోనే విద్యుత్ ఇంధన వనరుల కేంద్రంగా మారనున్న అనంతపురం అని వెల్లడించారు. వివిధ పర్యాటక ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం.. టూరిజం పాలసీకి అనుగుణంగానే వీరికి ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు.డైకిన్ ఏసీ తయారీ సంస్థకు శ్రీసిటీలో విస్తరణకు అనుమతి ఇచ్చారు. ప్రాజెక్టు వయబిలిటి దృష్టిలో ఉంచుకొని తిరిగి 500 ఎకరాలు కేటాయింపు ఉంటుందన్నారు. అమరావతిలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యాయ విశ్వ విద్యాలయం ఏర్పాటు- చేసే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం. 20 శాతం సీట్లు- ఏపీ విద్యార్థులకు కేటాయించేలా రిజర్వేషన్ అమలుచేస్తారు. 2,260 స్పెషల్ ఎడ్యుకేషన్ టీ-చర్ల నియామకం కోసం చేసిన ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం ఇచ్చింది. ఏపీ రిజిస్ట్రేషన్ చట్టం 22ఏ నిషేధ జాబితాలోని ఆస్తుల అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దుతో పాటు- ఫీజు మినహాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కడప జిల్లాలో అదానీ గ్రీన్ ఎనర్జీ కి 1000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు ఆమోదం లభించింది. సత్యసాయి జిల్లాలో అదానీ గ్రీన్ ఎనర్జీ 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు భూ కేటాయింపు చేసేందుకు ఆమోదం లభించింది. నెల్లూరు జిల్లా ముత్తుకూరులో 615 ఎకరాల భూమి పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ఏపీఐఐసీకి ఉచితంగా బదలాయించేందుకు అంగీకారం తెలిపింది. రాజకీయ కక్షతో హత్యకు గురైన తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం ఇచ్చింది. చిత్తూరు జిల్లా పలమనేరు రెవెన్యూ డివిజన్ నుంచి కొన్ని మండలాలు అన్నమయ్య జిల్లాలో కలిపేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ప్రాజక్టు కోసం ఐబీఎం, టీ-సీఎస్‌లతో ఏపీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలకు కేబినెట్ ఆమోదం లభించింది.

## నాలుగైదు రోజుల్లో కేరళను తాకనున్న నైరుతి

న్యూఢిల్లీ, మరో నాలుగైదు రోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నాయి. సాధారణంగా రుతు పవనాలు వచ్చే జూన్ 1వ తేదీ కన్నా చాలా ముందుగానే కేరళను చేరుకునే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) పేర్కొంది. మరో నాలుగైదు రోజుల్లో రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. ఈ నెల 22 నాటికి కర్ణాటక తీరంలో అల్పపీడనం అభివృద్ధి చెందే అవకాశం ఉన్నందున కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలు రెడ్ అలర్ట్‌లో ఉన్నాయి. ఈ నెల 22 నాటికి అల్పపీడనంగా మారుతుందని, ఆ తరువాత మరింత తీవ్రమవుతుందని ఐఎండి పేర్కొంది. ఈ నెల 24 వరకూ ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కొంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్, మణిపూర్, మిజోరం, త్రిపురలలో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు కేరళలో ప్రవేశిస్తే? దేశమంతటా వర్షాలు ప్రారంభవుతాయి. జులై 8 నాటికి దేశమంతా విస్తరిస్తాయి. మళ్లీ వాయువ్య భారతదేశం నుంచి సెప్టెంబర్ 17తో రుతు పనవనాల ఉపసంహారణ మొదలై అక్టోబర్ 15 నాటికి ముగుస్తుంది. రుతుపవనాలు ఈ నెల 27నాటికి కేరళను తాకే అవకాశం ఉందని గతంలో ఐఎండి అంచనా వేసిన సంగతి తెలిసిందే. ఊహించిన విధంగా రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తే.. 2009 మే 23 తర్వాత, రుతుపవనాలు భారత్‌లోకి అతిత్వరగా ప్రవేశిం చిన సంవత్సరంగా ఈ ఏడాది నిలుస్తుందని ఐఎండి పేర్కొంది. గతేడాది మే 30న, 2023లో జూన్ 8న, 2022లో మే 29న, 2021లో జూన్ 3న, 2020లో జూన్ 1న, 2019లో జూన్ 8న, 2018లో మే 29న రుతుపవనాలు కేరళలో ప్రవేశించాయి. ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షపాతం ఉంటుందని ఏప్రిల్‌లో ఐఎండి అంచనా వేసింది. ఎల్‌నినో పరిస్థితులు ఉండవని స్పష్టం చేసింది. ఎల్‌నినోతో భారత్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుంది.

## చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్

అమరావతి,కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. వైఎస్ జగన్ చేసిన సంస్కరణలను చంద్రబాబు సర్వనాశనం చేస్తున్నారని అన్నారు. ఇంటింటికీ రేషన్ సరఫరా వాహనాలు రద్దు చేయడం సరికాదని హితవు పలికారు. ఇంటింటికీ రేషన్ సరఫరా వాహనాలు రద్దు చేయడం సరికాదు. వైఎస్ జగన్ చేసిన సంక్షేమ పథకాలు ఆపడం దారుణం. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. తాడేపల్లిలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ..'వైఎస్ జగన్ తెచ్చిన సంస్కరణలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. కానీ, ఆ సంస్కరణలను చంద్రబాబు సర్వనాశనం చేస్తున్నారు. రేషన్ డెలివరీ వాహనాల వ్యవస్థను చంద్రబాబు తొలగించారు. ఈ వాహనాల ద్వారా పేదలకు ఎంతో ఉపయోగం జరిగింది. అలాంటి వ్యవస్థను చంద్రబాబు ఎలా నాశనం చేయగలుగుతున్నారు?. ఎండీయూల తొలగింపు ద్వారా 20వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. 2.60 లక్షల మంది వాలంటీర్లను కూడా రోడ్డున పడేశారు.ఇంటింటికీ మద్యం సరఫరా చేస్తూ రేషన్ బియ్యాన్ని ఆపేయటం ఏంటి?. పేద, మధ్య తరగతి ప్రజలకు రేషన్ నిలిపేసేందుకు ప్రభుత్వం ఎ÷-లాన్ చేస్తోంది. ఫస్ట్ ఎండీయూ వాహనాలు ఆ తర్వాత డిపోలు తొలగిస్తారు. చంద్రబాబుది శాడిస్టు బుద్ధి. అందుకే ప్రజలను పట్టి పీడిస్తున్నారు. గోదావరి వరదలు, విజయవాడ వరదల సమయంలో ఎండీయూ వాహనాలే ఆదుకున్నాయి. ఎండీయూ వాహనదారులకు మేము అండగా నిలుస్తాం. ఆ వాహనాలను కొనసాగించాల్సిందే. లేకపోతే వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం. ఎండీయూ వాహనాల ద్వారా ఏం అక్రమాలు జరిగాయో ప్రభుత్వం చెప్పాలి?. సీజ్ ద షిప్ ఎపిసోడ్ ఏమైంది?. ఆ కేసులో ఎంత బియ్యం సీజ్ చేశారో ప్రభుత్వం ఎందుకు చెప్పటం లేదు?. జగన్ సంస్కరణలను నాశనం చేయాలన్నదే చంద్రబాబు లక్ష్యం అని మండిపడ్డారు.

# బీహార్‌లో పెద్ద కలలు కంటున్న ప్రశాంత్ కిషోర్ !



పాట్నా:రాజకీయ వ్యూహకర్త నుంచి రాజకీయ నాయకుడిగా మారిన ప్రశాంత్ కిషోర్ బీహార్ లో ప్రభావవంతమైన నాయకుడిగా ఎదుగుతున్నారు. ఇటీవల ఉపఎన్నికల్లో పోటీ చేసిన ఆయన పార్టీ అభ్యర్థులు మూడో స్థానంలో నిలిచారు. ఊహించనంతగా ఓట్లు సాధించలేకపోయినా%% ప్రశాంత్ కిషోర్ ను ప్రజలు గుర్తిస్తున్నారన్నదానికి ఆ ఎన్నికల ఫలితాలు ఓ సంకేతంగా మారాయి. దాంతో ఆయన మరింత దూకుడుగా తన వ్యూహాలు అమలు చేస్తున్నారు.

సీఎం పదవి కోసం కాదు.. బీహార్ అభివృద్ధి కోసం !

ప్రశాంత్ కిషోర్ జన సురాజ్ అనే సంస్థను పెట్టి ఆ తర్వాత రాజకీయ పార్టీగా మార్చారు. కొన్ని రోజులు పాదయాత్ర చేశారు కానీ.. మధ్యలో ఆపేశారు. ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నారు. తాను ముఖ్యమంత్రి పదవి కోసం రాజకీయాలు చేస్తున్నానని వస్తున్న విమర్శలపై ఆయన రాజకీయ పద్దతిలోనే స్పందిస్తున్నారు. తాను పది మంది ముఖ్యమంత్రులు అయ్యేందుకు సహకరించానని .. పదవి కోసం తాను రాజ్ల నుకీయం చేయడం లేదన్నారు. బీహార్ కోసమే తాను రాజకీయం చేస్తున్నానని చెప్పుకొస్తున్నారు.

హర్యానా, పంజాబ్ ల నుంచి బీహార్‌కు వలస వచ్చేలా అభివృద్ధి !

బీహార్ చాలా వెనుకబడిపోయిందని అందరికీ తెలిసిన విషయమే. అక్కడి యువత పనుల కోసం.. ఉపాధికోసం పంజాబ్, హర్యానాతో పాటు ఉత్తరాది రాష్ట్రాలకు.. ఇంకా చెప్పాలంటే దక్షిణాదికీ వెళ్తూంటారు. వీటన్నింటినీ ఆగిపోయేలా చేసి.. పంజాబ్, హర్యానాలా నుంచే బీహార్ కు వచ్చేలా చేయడమే తన లక్ష్యమని అంటున్నారు. ప్రశాంత్ కిషోర్ పొలిటికల్ మోడల్ ఎలాంటిదో కానీ ఆయన మాత్రం.. అందరూ బాగుపడుతున్నారు.. మనం మాత్రం బాగుపడవద్దా అని అనుకునే బీహార్ యువతలో ఆశలు రేకెత్తించేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నారు.

ఇప్పటికీ ప్రధాన పోటీదారుగా మారలేకపోయిన ప్రశాంత్ కిషోర్ ప్రస్తుతం బీహార్ లో ఆర్జేడీతో కూటమి, బీజేపీ, జేడీయూ కూటమి కలిసి పోటీ చేస్తున్నాయి. మూడో పక్షంగా ప్రశాంత్ కిషోర్ ఉన్నారు. అయితే ప్రజలంతా ఆయన వైపు తిరిగేలా చేసుకోవడంలో విఫలమయ్యారు. అభివృద్ధి కాంక్షించేవారిని ఆయన ఆకట్టుకున్నారు. కానీ బీహార్ రాజకీయం అంతా కుల సమీకరణాల మీదనే ఆధారపడి ఉంటుంది. ఈ విషయంలో ఆయన వెనుకబడి ఉన్నారు. కుల, మతాలకు అతీతంగా.. బీహార్ అభివృద్ధి అనే అంశంతో ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు.

# 'పహల్గాం'కు సరిగ్గా నెల.. ప్రస్తుతం ఎన్ఐఏ ఏమి చేస్తుందంటే..?

జమ్ము కశ్మీర్: ఏప్రిల్ 22.. సరిగ్గా నెల రోజుల క్రితం జమ్మూకశ్మీర్ లోని పహల్గాంలోని బైసరన్ లోయలో ప్రశాంత వాతావారణంలో ఆహ్లాదంగా గడుతుపుతున్న పర్యాటకులపై.. ఏకే 47 చేతబట్టిన ఉగ్రమూకలు విరుచుకుపడ్డాయి. మతం పేరు అడిగి మరీ మగవారిపైకి తుపాకులు ఎక్కుపెట్టాయి.. విచక్షణారహితంగా కాల్పులు జరిపాయి. ఈ ఘటనలో 26 మంది మరణించారు. అది జరిగిన నెల రోజులు అయ్యింది!అసలు ఏమాత్రం ఊహించని ఈ ఘటనతో యావత్ భారతదేశంతో పాటు ప్రపంచమూ ఉలిక్కిపడింది. ఈ ఘటనను ప్రపంచదేశాలు ఖండించాయి. మరోపక్క ఈ ఘటన అనంతరం ప్రతీ భారతీయుడు ప్రతీకారంతో రగిలిపోయారు! దీంతో... ఆ ఘటన జరిగిన సుమారు రెండు వారాల తర్వాత భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఉగ్రమూకలను, వారికి ఆశ్రయం ఇచ్చి ఆదరిస్తున్న పాక్ ను వణికించేసింది. ఈ ఆపరేషన్ లో 9 ఉగ్రస్థావరాలు నేలమట్టం అవ్వగా.. దాదాపు 100 మంది ఉగ్రవాదులు నాశనమయ్యారు. దీంతో... భారత్ పై పాక్ ప్రతీకారచర్యలకు ఉపక్రమించింది. దీంతో... పాక్ కు భారత్ గట్టిగా బుద్ధిచెప్పింది. పాకిస్థాన్ నడిబొడ్డున డ్రోన్లు, మిస్సైళ్లతో దాడి చేసింది. పాక్ అణ్వాయుధ స్థావరం జస్ట్ మిస్ అనే కామెంట్లు వినిపించాయి. దీంతో.. కాల్పుల విరమణ అంటూ కాళ్ల బేరానికి వచ్చింది!ఆ సంగతి అలా ఉంటే... ఈ దాడి జరిగిన అనంతరం జమ్మూకశ్మీర్ పోలీసుల నుంచి ఫిర్యాదు అందుకున్న ఎన్ఐఏ... ప్రస్తుతం సాక్ష్యులను విచారిస్తోంది. ఈ పహల్గాం దాడిలో కనీసం ఐదుగురు ఉగ్రవాదుల హస్తం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే ముగ్గురు ఉగ్రవాదుల స్కెచ్ లు, ఫోటోలు విడుదలవ్వగా.. వారి గురించిన సమాచారం అందించినవారికి రూ.20 లక్షల రివార్డును



ప్రకటించారు. ఈ సమయంలో... కేసును దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఏ.. బాధితుల కుటుంబ సభ్యులు, పర్యాటకులు తీసిన ఫోటోలు, వీడియోలను సేకరించి, పరిశీలిస్తుంది. ఈ సమయంలో త్రీడీ మ్యాపింగ్ ను తయారు చేసిందని తెలుస్తోంది. ఈ క్రమంలో ఇప్పటివరకూ సుమారు 150 మందిని విచారించినట్లు తెలుస్తోంది. వారిలో కొంతమందిని విచారించి, విడుదల చేయగా.. మరికొంతమంది ఎన్ఐఏ అదుపులోనే ఉన్నారని కథనాలొస్తున్నాయి. ఈ క్రమంలో ఇప్పటివరకూ ఫోటోగ్రాఫర్లు, సాహసక్రీడల్లో పనిచేసినవారు, ఫోన్ ఆపరేటర్లు, దుకాణాదారులతో పాటు చాలా మందిని విచారించారు! మరోపక్క ఈ దాడికి పాల్పడిన ఉగ్రమూకల పాదముద్రలను గుర్తించినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వీలైనంత తొందర్లో పహల్గాం దాడికి పాల్పడిన ముష్కరులను గుర్తించి మట్టుబెడతారని అంటున్నారు! ఇక.. ఇటీవల బీఎస్ఎఫ్ జరిపిన దాడిలో ఆరుగురు ఉగ్రమూకలు మృతిచెందిన సంగతి తెలిసిందే!

# బీజేపీతో పొత్తుకు వైసీపీ సిద్ధమా ?

అమరావతి,ఏపీలో టీడీపీ కూటమి బలంగా ఉంది. ఎంత బలంగా అంటే మరో నాలుగేళ్ల తరువాత ఏపీలో జరిగే ఎన్నికల్లో పొత్తులతోనే పోటీ చేయాలని ఇప్పటి నుంచే ఒట్టు పెట్టుకుని ముదుకు సాగేటంత బలంగా ఉంది. ఇదిలా ఉంటే టీడీపీ అధినేత చంద్రబాబు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇద్దరూ కేంద్రంలోని బీజేపీ పెద్దలతో ఎంతో సాన్నిహిత్యంగా ఉంటున్నారు. బాబు సైతం 2014 నుంచి 2019 మధ్యలో జరిగిన అనుభవాలతో బీజేపీ పెద్దల మనసెరిగి నడచుకుంటున్నారు అని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇపుడు ఏపీలో కొత్త చర్చ స్టార్ట్ అయింది. దానిని స్టార్ట్ చేసిన వారు వైసీపీకి చెందిన సీనియర్ నేత మాజీ మంత్రి నెల్లూరు జిల్లాకు చెందిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి. ఆయన తాజాగా మాట్లాడుతూ జగన్ తప్పు చేశారని సంచలన కామెంట్స్ చేశారు. బీజేపీతో పొత్తు పెట్టుకోకపోవడం వైసీపీ చేసిన తప్పు అన్నారు. ఈసారి అవకాశం వస్తే పొత్తు పెట్టుకోవాలని సూచిస్తామని అన్నారు. ఇదిలా ఉంటే దేశంలో బీజేపీ అత్యంత బలంగా ఉంది. మోడీ ప్రజాకర్షణ నేతగా ఉన్నారు. పాక్ తో ఇటీవల జరిగిన పరిమిత స్థాయి దాడులు యుద్ధ వాతావరణం నేపథ్యంలో మోడీ మరింత బలోపేతం అయ్యారు. దేశ ప్రజలు మోడీని అత్యంత శక్తివంతమైన నేతగా చూస్తున్నారు. దాంతో ఈ ఇమేజ్ తో ఆయన మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తారని అంచనాలు ఉన్నాయి. ఇక వచ్చే ఎన్నికల్లోగా పాక్ తో ఒక మాదిరి యుద్ధం జరిగినా జరగవచ్చు అంటున్నారు. అదే కనుక జరిగితే మోడీ వెంటే దేశమంతా ఉంటుందని కూడా చెబుతున్నారు. ఇదిలా ఉంటే మోడీతో బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలకు కూడా ఎంతో మేలు జరుగుతుందని విశ్లేషణలు ఉన్నాయి. ఏపీలో చూస్తే మళ్ళీ బీజేపీ జనసేన టీడీపీ కూటమికి రాజకీయ వాతావరణం అనుకూలించే చాన్స్ ఉంది అని అంటున్నారు. దాంతో వైసీపీలో ఒక చర్చ జరుగుతోంది. దాని ఫలితమే నల్లపురెడ్డి తాజా కామెంట్స్ అని అంటున్నారు. బీజేపీతో మొదటి నుంచి స్నేహంగా ఉన్నది వైసీపీయే అని ఆ పార్టీలో వారు అనుకుంటున్నారుట. బీజేపీ పెద్దలు జగన్ తో ఎంతో సన్నిహితంగా ఉంటూ వచ్చారని చెబుతున్నారు. 2019 నుంచి 2024 మధ్యలో అయితే ఏకంగా ఎన్డీయే ప్రభుత్వంలో చేరమని రెండు మంత్రి పదవులు ఇస్తామని కూడా ఆఫర్ చేసినట్లుగా కూడా చెబుతున్నారు. ఇక డిప్యూటీ స్పీకర్ కూడా ఇస్తామని ఒక దశలో ప్రతిపాదించారని గుర్తు చేస్తున్నారు. అయితే మైనారిటీలు దళితులు ఇతర వర్గాల ఓటు బ్యాంక్ కి గండి పడుతుందని భావించే జగన్ బీజేపీతో పొత్తులకు దూరంగా ఉన్నారని అంటున్నారు. అయితే జగన్ వ్యూహం



అంచనాలు తప్పు అయ్యాయని 2024 ఫలితాలు నిరూపించాయని అంటున్నారు. మైనారిటీలు ఎస్టీలు దళితులు టీడీపీ కూటమి వైపు మొగ్గు చూపడంతో చరిత్రలో కనీ వినీ ఎరగని తీరులో కూటమి 164 సీట్లను సాధించింది అని గుర్తు చేస్తున్నారు. మోడీ ఇమేజ్ ముందు ఇవన్నీ కొట్టుకుపోతున్నాయని అంటున్నారు. నిజానికి ఎన్డీయే కూటమిలో వైసీపీని చేరమని మహారాష్ట్రకు చెందిన కేంద్ర మంత్రి రాందాస్ అతవాలే వంటి వారు కూడా అనేక సార్లు చెప్పారని గుర్తు చేస్తున్నారు. అయితే వైసీపీ ఆఫర్లు అన్నీ వదిలేసుకుని ఇపుడు దిగాలుగా చూస్తోందని అంటున్నారు. వైసీపీ తటస్థ విధానం ఈ రోజున ఏపీ రాజకీయాల్లో అసలు పనికిరాదు అని ఆ పార్టీలో సీనియర్లు అంటున్నారుట. టీడీపీ కూటమి బలంగా ఉందని ఒంటరిగా వైసీపీ ఎన్నికలకు వెళ్తే ఫలితాలు ఎలా ఉంటాయో చెప్పడం కష్టమని అంటున్నారు. మరి ఇవన్నీ బాగానే ఉన్నాయి కానీ వైసీపీ వదిలేసుకున్న చాన్స్ ని టీడీపీ ఒడుపుగా పట్టుకుంది. ఇపుడు కూటమి మిత్రులు హ్యాపీగా ఉంటున్నారు. ఈ మధ్యలోకి వైసీపీ ఎలా ప్రవేశించగలదు అన్నదే చర్చగా ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్డీయే నుంచి బయటకు వచ్చి వైసీపీకి చాన్స్ ఇచ్చేలా టీడీపీ వ్యవహరించదు అని అంటున్నారు. ఇక పవన్ కళ్యాణ్ ఈ కూటమి కలసికట్టుగా ఉండేందుకు ఏమి చేయాలో అన్నీ చేస్తారని అం టున్నారు. దాంతో బీజేపీ కూడా వైసీపీ వైపు చూసే అవకాశాలు అయితే లేవు అని అంటున్నారు. మొత్తానికి వైసీపీ అధినేత తనదైన విధానాలతో గెలుపు అవకాశాలను తగ్గించుకుంటున్నరు అన్నదే సీనియర్ల వేదనగా ఉంది అంటు న్నారు. మరి బీజేపీ వైసీపీల మధ్య ఎప్పటికైనా పొత్తు కుదురుదుందా అధినేత వైఖరి మారినా ఆ చాన్స్ వస్తుందా అంటే కాలమే జవాబు చెప్పాలని అంటున్నారు.

# మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతకు షాక్



హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతా రావుకు పార్టీ అధిష్టానం షోకాజ్ నోటీసులిచ్చింది. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌పై చేసిన వ్యాఖ్యలు, గాంధీ భవన్‌లో నిరసన చేయడాన్ని కాంగ్రెస్ అధిష్టానం తప్పుబట్టింది. క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు సునీతా రావుకు జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నోటీసు జారీ చేశారు. సునీతా రావుకు ఏమైనా ఇబ్బంది ఉంటే పార్టీలో చర్చించాలి కానీ బహిరంగంగా మాట్లాడడం తప్పని.. దీనిపై 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని జాతీయ మహిళా కాంగ్రెస్ లేఖలో పేర్కొంది. వివరణ ఇవ్వకపోతే కాంగ్రెస్ నిబంధనల మేరకు చర్యలు ఉంటాయని నోటీసులో అధిష్టానం స్పష్టం చేసింది. కొద్ది రోజుల క్రితం గాంధీభవన్‌లో సునీతా రావు నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ముఖ్యంగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌పై పలు వ్యాఖ్యలు చేశారు. టీపీసీసీ చీఫ్ ఛాంబర్ ఎదుట సునీతారావు ధర్నాకు దిగారు. పది మంది మహిళా నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. కాంగ్రెస్ మహిళా నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని.. పోస్టుల విషయంలో మహిళా నాయకులను పార్టీ పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం, కార్పొరేషన్ పదవుల్లోనూ మహిళా నేతలకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదని విమర్శించారు. మహేష్ గౌడ్ బంధువులకే పదవులు కట్టబెడుతున్నారంటూ ఆరోపణలు గుప్పించారు. కార్పొరేషన్లు, పార్టీ కమిటీల్లో మహిళా కాంగ్రెస్ నేతలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ సునీతారావు గాంధీభవన్‌లో ఆందోళనకు దిగారు. క్రమంలో అధికార పార్టీలో ఉంటూ పార్టీ ఆఫీసులో నిరసన చేపట్టడాన్ని అధిష్టానం తీవ్రంగా తప్పుబట్టింది. అలాగే టీపీసీసీ చీఫ్‌పై ఆరోపణలు చేయడాన్ని మహిళా కాంగ్రెస్ జాతీయ నాయకత్వం తప్పుబట్టింది. దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా సునీతారావుకు జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నోటీసులు జారీ చేశారు.

# చంద్రబాబుకే వార్నింగ్ ఇచ్చిన టీడీపీ లేడీ ఎమ్మెల్యే..!

నంద్యాల:టీడీపీ లో లేడీ ఫైర్ బ్రాండ్ ఆమె. కానీ తేడా వస్తే ప్రతిపక్షం అయినా సొంత పార్టీ అయినా ఒక్కటే అన్నట్టుగా వ్యవహరించే ఆమె.. ఇప్పుడు టీడీపీ అధిష్టానానికి ఇంకా చెప్పాలంటే ఏకంగా చంద్రబాబుకే వార్నింగ్ ఇచ్చేలా మాట్లాడారు. ఇంతకీ ఆమె మరెవరో కాదు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ. తాజాగా నంద్యాలలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మినీ మహానాడులో అఖిలప్రియ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. మినీ మహానాడు వేదికగా అఖిల్ ప్రియ మాట్లాడుతూ.. పార్టీ పట్ల, భూమా కుటుంబం పట్ల అంకితభావంతో ఉన్నవారికి, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తప్పకుండా పదవులు వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాంత్ అన్న పార్టీకి, తమ కుటుంబానికి ఎంతో చేశారు. ఆయన ప్రొఫైల్ ను ఇప్పటికే లోకేష్ కు ఇచ్చాము.. అలాగే చంద్రబాబుకు ఇచ్చి వచ్చాము. కానీ అదే మండలం నుంచి ముక్కు మొహం తెలియని వారు ఎవరైనా వెళ్లి పదవి తెచ్చుకుంటే ఆళ్లగడ్డ నియోజవకర్గంలో అడుగు కూడా పెట్టనివ్వం అంటూ అఖిల ప్రియ హెచ్చరికలు జారీ చేశారు. పదవులు ఇవ్వాలనుకుంటే పార్టీలో మొదటి నుంచి ఉన్న వారికే ఇవ్వాలని.. అంతే తప్ప మాకు తెలియకుండా ఎవరికైనా పదవులు ఇస్తే ఊర్లో అడుగుపెట్టనివ్వమంటూ అఖిలప్రియ టీడీపీ అధిష్టానానికి అల్టిమేట్ జారీ చేశారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. కాగా, నంద్యాల జిల్లా టీడీపీ కొత్త సమన్వయకర్తగా శిరివెళ్ళ



మండలానికి చెందిన గోగిశెట్టి నరసింహారావును నియమించాలని అధిష్టానం భావిస్తున్నట్లు గత కొద్ది రోజుల నుంచి జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఆయనకు కాకుండా అదే మండలానికి చెందిన శ్రీకాంత్ రెడ్డికి జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలంటూ అఖిలప్రియ అధిష్టానానికి సూచించారు. కానీ, భూమా అఖిలప్రియ పై స్థానికంగా పార్టీ నేతల్లో వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో టీడీపీ హైకమాండ్ ఆమె సూచన పట్టించుకోలేదు. ఎన్నికలకు ముందు టీడీపీలో చేరి పార్టీ విజయంలో కీలక పాత్రను పోషించిన గోగిశెట్టి నరసింహారావుకే జిల్లా టీడీపీ కొత్త సమన్వయకర్తగా నియమించాలని హైకమాండ్ నిర్ణయించిందని బలంగా టాక్ నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే పార్టీ అధిష్టానికి అఖిల ప్రియ వార్నింగ్ ఇచ్చారంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

# గ్రామ పంచాయతీల అభివృద్ధి.. ఒకే రోజున రూ.153 కోట్ల బిల్లుల చెల్లింపులు..!




హైదరాబాద్, గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధుల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒక్క రోజులోనే రూ.153 కోట్లు విడుదల చేస్తూ 9990 పెండింగ్ బిల్లులను క్లియర్ చేసింది. ముఖ్యంగా రూ.10 లక్షల లోపు బిల్లులను ఈ విడతలో చెల్లించడం గమనార్హం. 2024 ఆగస్టు వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులకు ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం, గత ప్రభుత్వం మిగిల్చిన భారీ మొత్తంలో పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌కు నడుం బిగించింది. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల కోసం గ్రామ పంచాయతీలకు భారీగా నిధులు విడుదల కావడం, అభివృద్ధికి అద్దం పడుతోంది. ఇకపోతే, ప్రత్యేక అభివృద్ధి నిధి కింద చేపట్టిన వివిధ పనుల కోసం రూ.85 కోట్లు విడుదల చేయడం జరిగింది. ఇది గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతం ఇవ్వనుంది. గురువారం ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన బ్యాంకర్ల సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో "రాజీవ్ యువ వికాసం" కార్యక్రమంపై చర్చ జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు సెక్రటేరియట్‌లో MIM ఎమ్మెల్యేలతో మరో ప్రత్యేక సమావేశం జరగనుంది. ఇందులో ఓల్డ్ సిటీ సమస్యల పరిష్కారంపై చర్చించనున్నారు. ఈ చర్యలన్నీ గ్రామీణాభివృద్ధి, యువత సంక్షేమం, పట్టణ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయి.

# రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోంది



అనంతపురం,రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోందని,. భయపెట్టి పాలన చేయాలనుకోవడం మూర్ఖత్వం అని వైకాపా సీనియర్ నేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు.. ఇంటింటికీ రేషన్ సరఫరా వాహనాలు రద్దు చేయడం సరికాదని హితవుచెప్పారు.. ఉమ్మడి అనంతపురం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్‌ల సమావేశంలో పాల్గొన్న మిథున్‌రెడ్డి.. ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు.. అసలు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో మద్యం కుంభకోణం జరగలేదని స్పష్టం చేశారు.. కట్టుకథలతో మద్యం కుంభకోణం జరిగిందని టీడీపీ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు.. ఇక, వైఎస్ జగన్ ఇచ్చిన సంక్షేమ పథకాలు ఆపడం దారుణమైన విషయం అన్నారు.. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. జగన్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయకుండా.. ప్రజల దృష్టిని మరల్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.. అనంతపురం జిల్లాలో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కి విదేశీ నిధులు ఆపడం దుర్మార్గం అని అన్నారు.. హంద్రీనీవా లైనింగ్ పనులపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించారు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి.. ఏపీ ప్రభుత్వంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. మంగళవారం రోజు సంచలన వ్యాఖ్యలుచేసిన విషయం విదితమే.. ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతూనే అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు.. ఇప్పుడు ఉన్న అధికారులు అన్యాయమైన పనులు చేస్తే.. రేపు మళ్లీ మన రోజు వస్తుంది.. ఇప్పుడు పేర్లు రాసిపెట్టుకొంది.. రిటైర్డ్ అయినా.. విదేశాలకు పారిపోయినా.. తీసుకొచ్చిన సినిమా చూపిస్తామంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే..

## పుష్కరాలకు పోటెత్తుతున్న భక్తులు

కాళేశ్వరం,జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో దక్షిణ త్రివేణి సంగమంగా పేరొందిన కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ఘనంగా కొనసాగుతున్నాయి. భక్తులు తెలంగాణ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. కేవలం కొన్నిరోజులే పుష్కరాలు ఉండడంతో భక్తులు భారీగా తరలివస్తున్నారు. మహిళలు నదీ తీరాన దీపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీకాళేశ్వర ముక్తేశ్వర స్వామివారిని దర్శించుకుంటున్నారు. పుష్కరాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి పర్యవేక్షించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్షణ బోటులో వారు ప్రయాణించారు.

# పాలమూరు-రంగారెడ్డిలపై సిబిఐ విచారణ...

న్యూఢిల్లీ,పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అక్రమాలపై సీబీఐ దర్యాప్తు చేయాలని మాజీమంత్రి నాగం జనార్ధన్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. హైకోర్టు ఆదేశాలలో జోక్యం చేసుకోలేమని అత్యున్నత ధర్మాసనం స్పష్టం చేసింది. జస్టిస్ బివి.నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. నాగం తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో పెద్ద మోసం జరిగిందని, ప్రభుత్వ ఖజానాకు 2వేల 426 కోట్ల రూపాయల నష్టం జరిగిందని వాదించారు. ప్రభుత్వం ఆమోదించిన ప్రకారం 65 శాతం పంపులు, మోటార్ల కోసం బీహెచ్ఈఎల్‌కు చెల్లింపులు చేయాలని, 35 శాతం సివిల్ వర్క్సకు, మేఘాకు చెల్లింపులు చేయాలని ప్రశాంత్ భూషణ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కానీ.. అంతర్గత ఒప్పందం ప్రకారం బీహెచ్ఈఎల్‌కు చెల్లింపులను 65 శాతం నుంచి 20 శాతానికి తగ్గించారని, మేఘాకు 80 శాతం చెల్లింపులు జరిగాయని.. 65:35 నుంచి 20:80కు



ఎలా మారిందని ప్రశాంత్ భూషణ్ పాయింట్ లేవనెత్తారు. ఇందులో భారీ ఎత్తున అవినీతి జరిగిందని సుప్రీంలో వాదనలు వినిపించారు. 'మేఘా' తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గీ వాదించారు. తెలంగాణ హైకోర్టులో దీనికి సంబంధించిన 5 పిటిషన్లు కొట్టివేశారని, ఇందులో ఎలాంటి ఫ్రాడ్ జరగలేదని కోర్టు స్పష్టం చేసిందని సుప్రీం కోర్టుకు చెప్పారు.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS,** H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS,** H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**